Follow: @mahaadaily
22-03-2026
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 84 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

పులి బక్కపడినంత మాత్రాన.. చారకలు పోవు

ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యలు



02

అరగ్యారంటీ కూడా అమలు కాలేదు


కేటీఆర్ హాట్ కామెంట్స్



02

పసిడి నేలచూపు

13వేలు తగ్గిన ధర



02



## యుద్ధంలో ఇరాన్‌కు కాసుల పంట

**హార్మూజ్ జలసంధిలో .. ఇరాన్ కు ఆదాయం**
**నష్టాల యుద్ధంలో ఊహించని లాభాలు**
**జలసంధిని తక్షణమే తెరవాలని 22 దేశాల రిక్వెస్ట్**


**మహా.**

యుద్ధం అనగానే ప్రాణనష్టం, విధ్వంసం, ఆర్థిక పతనం కళ్లముందు కదలాడుతాయి. కానీ, పశ్చిమాసియాలో ప్రస్తుతం రగులుతున్న అమెరికాఇరాన్ యుద్ధం మాత్రం ఒక దేశానికి అనూహ్యంగా సిరులు కురిపిస్తోంది. అదే 'ఇరాన్'. దశాబ్దాలుగా కఠినమైన ఆర్థిక ఆంక్షలతో అల్లాడిపోయిన ఆ దేశం.. తాజా పరిణామాలను తమకు అనుకూలంగా మలుచుకుని ఆర్థికంగా, దౌత్య పరంగా ఎన్నడూ లేనంత బలపడుతోంది. శత్రువుల దాడిని తిప్పికొట్టడమే కాకుండా, అంతర్జాతీయ చమురు సంక్షోభాన్ని ఒక సువర్ణ అవకాశంగా మార్చుకున్న ఇరాన్ ఎత్తుగడలు ఇప్పుడు ప్రపంచ దేశాలను, ఆర్థిక నిపుణులను విస్మయానికి గురిచేస్తున్నాయి.

మిగతా 2లో

## భారత్‌కు ఎనర్జీ షాక్

**ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాకు భారీ దెబ్బ**
**ఖతార్ గ్యాస్ కేంద్రంపై ఇరాన్ దాడి**



**దోహా :**

ఇరాన్ క్షిపణి దాడులతో ఖతార్‌లోని ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ కేంద్రాల్లో ఒకటైన రాస్ లఫాన్ ఇండిస్టియల్ సిటీ తీవ్రంగా దెబ్బతిన్నది. దీంతో ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరా సంక్షోభం మరింత తీవ్రమై, భారత్ వంటి దిగుమతి చేసుకునే దేశాలకు పెద్ద ఎనర్జీ షాక్ తగిలే పరిస్థితి ఏర్పడింది. ఇరాన్ ఇటీవల చేసిన దాడుల్లో ఖతార్‌కు చెందిన ముఖ్య గ్యాస్ ఉత్పత్తి కేంద్రాలు లక్ష్యంగా మారాయి. ఈ దాడులతో ఖతార్ ఎల్ఎన్‌జీ ఎగుమతి సామర్థ్యంలో సుమారు 17 శాతం తగ్గుదల ఏర్పడింది.

మిగతా 2లో



# దానంకు షాక్

**స్పీకర్ తీర్పుపై బీజేపీ సవాల్**
**రేపు హైకోర్టులో విచారణ**
**కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన ఆధారాల సమర్పణ**

**హైదరాబాద్, మహా.**



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు షాక్ తగిలింది. దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అంటూ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ డిక్లేర్ చేయగా, ఈ తీర్పును బీజేపీ హైకోర్టులో సవాల్ చేసింది. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేసిన తాజా పిటిషన్ తో ఈ వ్యవహారం తెలంగాణ హైకోర్టు మెట్లు ఎక్కింది. సోమవారం ఈ కేసు విచారణకు వచ్చే అవకాశముంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గుర్తుపై ఖైరతాబాద్ నుంచి ఘన విజయం సాధించిన దానం నాగేందర్, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఒక పార్టీ బీఫామ్ పై అసెంబ్లీకి ఎన్నికైన వ్యక్తి, ఏమాత్రం రాజీనామా చేయకుండా మరో జాతీయ పార్టీ తరపున పార్లమెంట్ ఎన్నికల్లో నామినేషన్ వేసి పోటీ చేయడం ఫిరాయింపుల చట్టం కిందకే వస్తుందని, తక్షణమే ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్, బీజేపీ నేతలు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కు డెడ్ లైన్ విధించగా, దీనిపై అందరూ బీఆర్ఎస్ సభ్యులేనని స్పీకర్ తేల్చేశారు. దానం ఇంకా సాంకేతికంగా బీఆర్ఎస్ లోనే ఉన్నారని స్పీకర్ తీర్పునివ్వడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. దీనిపై దానం నాగేందర్ హర్షం వ్యక్తం చేస్తూ, తాను సికింద్రాబాద్ నుంచి పోటీ చేయడం తన వ్యక్తిగతమని, ప్రాథమిక హక్కును ఉపయోగించుకుని మాత్రమే బరిలో నిలిచానని తనదైన శైలిలో వాదనలు వినిపించారు.

మిగతా 2లో



## జీవన్ రెడ్డికి మంత్రుల బుజ్జగింపులు

మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి నచ్చజెప్పేయత్నం
మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ ఫోన్
దేవుడు శాసిస్తే..జీవుడు అనుసరిస్తాడు అని జీవన్ రెడ్డి వ్యాఖ్య
తగ్గని జీవన్ రెడ్డి.. 25 న పార్టీకి రాజీనామా చేసే ఛాన్స్

**జగిత్యాల, మహా :**

దాదాపు నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్రను పోషించిన సీనియర్ నేత జీవన్ రెడ్డిని దారికి తెచ్చుకునేందుకు అధికార పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. పార్టీ ఫిరాయింపులు, వలస నేతల ప్రాధాన్యతపై రగిలిపోతున్న జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు మంత్రుల బృందం రంగంలోకి దిగింది. శనివారం ఉదయం జీవన్ రెడ్డి నివాసంలో కీలక భేటీ జరిగింది. పార్టీ వీడొద్దంటూ ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పిలుపును తిరస్కరించిన జీవన్ రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లారు. మీడియాను లోపలికి అనుమతించకుండా, అల్పాహారం చేస్తూ సుమారు గంటన్నర పాటు జీవన్ రెడ్డితో వీరు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తదితర అంశాలతో పాటు ప్రభుత్వానికి మద్ధతుగా ఉండేందుకు పిరాయింపులను ఎందుకు ప్రోత్సహించాల్సి వచ్చిందన్న అంశంపై శ్రీదర్ బాబు టీం జీవన్ రెడ్డికి వివరణ ఇచ్చింది. "నేటి కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా లేదు" అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మంత్రుల ముందే తన ఆవేదనను వెళ్లగక్కారు. సొంత పార్టీ నేతలకు అన్యాయం చేస్తూ, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి పెద్దపీట వేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.

మిగతా 2లో

## ఒకటి.. రెండు కాదు.. 24 సార్లు

**రోహిత్ రెడ్డి టీమ్ కు డ్రగ్ సప్లయ్ చేసిన అభిషేక్ సింగ్**
**విచారణలో సంచలనాలు..**
**దేశవ్యాప్తంగా నెట్ వర్క్**



**హైదరాబాద్, మహా.**

రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ వ్యవహారం రోజుకో కీలక మలుపు తిరుగుతోంది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం ఏకంగా 9 మంది అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) రంగంలోకి దించడంతో విచారణ వేగవంతమైంది. తాజాగా ఈ డ్రగ్స్ పార్టీకి కొకైన్ సరఫరా చేసిన ప్రధాన నిందితుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో కేసులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.

మిగతా 2లో

## ఏప్రిల్ లో మోదీ సభ

**జీహెచ్ఎంసీ టార్గెట్ గా బీజేపీ స్కెచ్**
**కీలక నేతల పర్యటనకు ప్రయత్నం**
**బీబీనగర్ ఎయిమ్స్ ప్రారంభం..**
**పరేడ్ గ్రౌండ్ లో సభ**

**హైదరాబాద్, మహా**




గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు బీజేపీ ఇప్పటి నుంచే సన్నద్ధమవుతోంది. ఎంపీ ఎన్నికల తర్వాత పార్టీ పరిస్థితి రోజురోజుకూ ప్రశ్నార్థకంగా మారడంతో గ్రేర్ ఎన్నికల్లో సత్తా చూపి కార్యకర్తల్లో నెలకొన్న నిస్తేజాన్ని పటాపంచలు చేయాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ లో ఓఆర్ఆర్ పరిధిలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసిన రాష్ట్ర ప్రభుత్వం మూడు ముక్కలుగా విభజించి మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది.

మిగతా 2లో

## కాకినాడ నౌకాశ్రయంలో భారీ కుంభకోణం

**పౌర సరఫరాల శాఖ దాడులు.. 65 లక్షల విలువైన బియ్యం స్వాధీనం**
**నౌకాశ్రయం వేదికగా అక్రమ దందా**



మిగతా 2లో

## తిరుమల ప్రసాదాల స్వచ్ఛతకు భరోసా



**దేశంలోనే తొలిసారిగా ఫుడ్ సేఫ్టీ ల్యాబ్**
**ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**తిరుమల, మహా :**

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ అంశం దేశవ్యాప్తంగా సృష్టించిన కలకలం నేపథ్యంలో, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లకు తావులేకుండా ఏపీ ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పటిష్ఠ చర్యలు చేపట్టాయి. శ్రీవారి ప్రసాదాల స్వచ్ఛతను కాపాడటమే లక్ష్యంగా దేశంలోనే తొలిసారిగా తిరుమలలో అత్యాధునిక ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

మిగతా 2లో






# అరగ్యారంటీ కూడా అమలు కాలేదు

## కేటీఆర్ హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా** ఆరు గ్యారంటీలపై సీఎం రేవంత్ రెడ్డి సంతకం చేసిన దస్త్రం కనిపించకుండా పోయిందన్న బీఆర్ఎస్ నేత కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం 4 కోట్ల మందికి టోపీ పెట్టిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు, లీగల్ సెల్ విభాగంతో కేటీఆర్ సమావేశం అయ్యారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత అంశంపై ప్రైవేట్ మెంబర్ బిల్లుపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం రోజున 6 గ్యారంటీల దస్త్రంపై సంతకం చేశారని, అభయహస్తం అనే దస్త్రంపై రేవంత్ రెడ్డి తొలి సంతకం చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. గవర్నర్ ప్రసంగంలోనూ ఆరు గ్యారంటీలపై సంతకం జరిగిందని చెప్పించారని, ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటీ కూడా ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ ప్రైవేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టనున్నామని ప్రకటించారు. వచ్చే శుక్రవారం నాడు శాసన సభలో తాము ప్రైవేటు బిల్లు పెట్టాలని నిర్ణయించామని, తాము సభలో బిల్లు ప్రవేశపెట్టేలా అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నామని అన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన అంశమే అయినందున ఆ పార్టీ కూడా బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు.

# కాకినాడ నౌకాశ్రయంలో భారీ కుంభకోణం

**అమరావతి, మహా.**



కాకినాడ నౌకాశ్రయం వేదికగా జరుగుతున్న ఒక భారీ కుంభకోణాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు శనివారం రట్టు చేశారు. పేదల ఆకలి తీర్చాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని విదేశాలకు తరలించేందుకు ప్రయత్నించిన ఒక ముఠా ఆట కట్టించారు. పక్కా సమాచారంతో నౌకాశ్రయ ప్రాంగణంలో ఆకస్మిక దాడులు నిర్వహించిన యంత్రాంగం 5 భారీ సరుకు రవాణా వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 140 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుంది. పట్టుబడిన ఈ సరుకు విలువ సుమారు అరవై ఐదు లక్షల రూపాయలు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

స్వాధీనం చేసుకున్న నిల్వలను నిశితంగా పరిశీలించిన అధికారులకు అందులో ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా కలిపే పోషక విలువలతో కూడిన బలవర్ధక గింజలు కనిపించాయి. దీనితో ఇవి కచ్చితంగా ప్రభుత్వ పంపిణీ బియ్యమేనని వారు నిర్ధారించారు. పేదల కోసం ఉద్దేశించిన ఈ ఆహారాన్ని దళారులు అత్యంత పకడ్బందీగా సేకరించి నౌకాశ్రయం ద్వారా విదేశాలకు ఎగుమతి చేసి సొమ్ము చేసుకునేందుకు కుట్ర పన్నినట్లు ఈ దాడుల ద్వారా స్పష్టమైంది. ఈ అక్రమ వ్యాపారం వెనుక ఎవరెవరి హస్తం ఉందనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. గతంలో కూడా ఈ నౌకాశ్రయం కేంద్రంగా ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఎన్నో వెలుగుచూశాయి. ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి సైతం ఈ మార్గం ద్వారానే భారీ ఎత్తున నిల్వలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారనే ఆరోపణలు దశాబ్దాలుగా వినిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో ప్రభుత్వ పెద్దలు అక్రమాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించడంతో నిఘా వర్గాలు పూర్తిగా అప్రమత్తమయ్యాయి. ఇందులో భాగంగానే అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న క్రమంలో ఈ భారీ దందా బయటపడింది. ఏకంగా 140 టన్నుల సరుకు ఒకేసారి పట్టుబడటం చూస్తుంటే దీని వెనుక ఒక పెద్ద వ్యవస్థీకృత ముఠా ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి.

ఈ వ్యవహారంలో పట్టుబడిన వాహనాలను జప్తు చేసిన యంత్రాంగం సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. నౌకాశ్రయంలో పనిచేసే కొందరు సిబ్బందికి ఈ అక్రమ రవాణాతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ సాగుతోంది. ప్రాథమిక ఆధారాలు సేకరించిన దర్యాప్తు సంస్థలు ఈ కుంభకోణం మూలాలను వెతికే పనిలో పడ్డాయి. పేదల హక్కులను కాలరాస్తూ వారి నోటికాడ కూడును లాగేసుకునే ఇలాంటి నేరస్తులను ఏమాత్రం ఉపేక్షించబోమని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నౌకాశ్రయ పరిసరాల్లో నిఘా మరింత పటిష్టం చేస్తామని వారు వెల్లడించారు.

# తిరుమల ప్రసాదాల స్వచ్ఛతకు భరోసా

మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు శనివారం ఈ ల్యాబ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, టీటీడీ, ఏపీ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ల సంయుక్త పర్యవేక్షణలో ఈ ల్యాబ్ రూపుదిద్దుకుంది. మొత్తం 12,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ. 19.75 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. జనరేటర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం అదనంగా మరో రూ.60 లక్షలు ఖర్చు చేశారు. విశేషమేమిటంటే ఈ అత్యాధునిక ల్యాబ్‌ను కేవలం 9 నెలల రికార్డు సమయంలో పూర్తి చేయడం. ఈ ల్యాబ్ ఏర్పాటుతో ఇకపై ప్రసాదాల తయారీకి వాడే నెయ్యి, నూనె, పాలు, పప్పు దినుసులు వంటి ముడిసరకుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించే అవకాశం ఉంటుంది. ఈ ల్యాబ్‌లో అత్యంత సూక్ష్మస్థాయి కల్తీని కూడా గుర్తించేందుకు వీలుగా ఎల్సీఎంఎస్, ఐసీపీఎంఎస్, బాంబ్ కెలోరీమీటర్, అటామిక్ ఎబ్జార్షన్ స్పెక్ట్రోమీటర్ (ఏఏఎస్) వంటి అత్యాధునిక పరికరాలను సమకూర్చారు. వీటితో పాటు తాగునీటిలోని క్లోరైడ్, సల్ఫేట్ వంటి రసాయనాల శాతాన్ని కూడా కచ్చితంగా కొలవవచ్చు. ఈ ల్యాబ్‌లో రసాయన, మైక్రోబయాలజీ విభాగాలు ఉన్నాయి.

**త్వరలో ఈ నోస్, ఈ టంగ్ పరికరాలు**



త్వరలో వాసన, రుచిని బట్టి కల్తీని గుర్తించే ఈ-నోస్, ఈ-టంగ్ పరికరాలు

మరో రెండు నెలల్లో ఈ ల్యాబ్‌కు మరింత ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రానుంది. టీటీడీ అభ్యర్థన మేరకు కేంద్రం రూ.3 కోట్లు మంజూరు చేయడంతో 'ఈ నోస్', 'ఈటంగ్' అనే ప్రత్యేక పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ పరికరాల ద్వారా నెయ్యి శాంపిల్‌ను పరీక్షిస్తే.. దాని వాసన, రుచి ఆధారంగా అది స్వచ్ఛమైనదా? లేక కల్తీ జరిగిందా? అనే విషయాన్ని క్షణాల్లో తేల్చేయవచ్చు. ఈ ల్యాబ్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుండటంతో ఇకపై ప్రసాదాల నమూనాలను పరీక్షల కోసం బయటి ల్యాబ్‌లకు పంపాల్సిన అవసరం ఉండదు.

# జీవన్ రెడ్డికి మంత్రుల బుజ్జగింపులు

మొదటి పేజీ తరువాయి)

మంత్రుల వాదనతో ఏ మాత్రం ఏకీభవించని జీవన్ రెడ్డి తన పయనమేంటన్నది కుండబద్దలు కొట్టారు. మంత్రులు ఎంత బతిమాలినా జీవన్ రెడ్డి మెత్తబడినట్లు కనిపించలేదు. కాంగ్రెస్ పార్టీని వీడాలన్న తన నిర్ణయంలో ఏ మాత్రం మార్పులేదని జీవన్ రెడ్డి తేల్చి చెప్పడంతో చేసేదేమీ లేని మంత్రులు వెనుతిరగాల్సి వచ్చింది.

**25 న రాజీనామా**

ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన పదవులకు కూడా జీవన్ రెడ్డి రాజీనామా చేయనున్నారు. ఈ మేరకు తన అనుయాయులు, అభిమానులకు జీవన్ రెడ్డి సంకేతాలు పంపించారు. గతంలోనే జీవన్ రెడ్డి ఉగాది తర్వాత తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో జీవన్ రెడ్డి బయనమెటు అనే అంశంపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చ మొదలైంది. బీఆర్ఎస్ వైపు వెళ్తారా? బీజేపీలో చేరుతారా, లేక స్వతంత్రంగా ఉంటారా? అనేది జగిత్యాల ప్రజలు, ఆయన అభిమానులు ఎదురు చూస్తున్నారు.

# దానంకు షాక్

మొదటి పేజీ తరువాయి)

**ఎంపీ నామినేషన్.. ఓట్ల లెక్కలతో..**

స్పీకర్ నిర్ణయాన్ని అంగీకరించని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దానం నాగేందర్ పార్టీ మారలేదన్న స్పీకర్ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ ఫిరాయింపులను ప్రోత్సహించేలా స్పీకర్ నిర్ణయం ఉందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. దానం నాగేందర్ సికింద్రాబాద్ లో నామినేషన్ వేసిన పత్రాల కంటే, ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా వచ్చిన ఓట్ల కంటే పెద్ద ఆధారం ఇంకేం కావాలని ఆయన న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్ లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన డిమాండ్లు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వణుకు పుట్టిస్తున్నాయి. నామినేషన్ పత్రాల ఆధారంగా దానం నాగేందర్ పై తక్షణమే అనర్హత వేటు వేయాలని కోరడమే కాకుండా, పార్టీ మారిన నాటి నుంచి నేటి వరకు ఆయన ఎమ్మెల్యే హోదాలో పొందిన జీతభత్యాలను సైతం వెనక్కి రికవరీ చేయాలని ఆయన న్యాయస్థానాన్ని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ఉల్లంఘనకు ఇంతకంటే స్పష్టమైన ఉదాహరణ మరొకటి ఉండదని బీజేపీ పట్టుబడుతోంది. దీనిపై తెలంగాణ హైకోర్టు సోమవారవ విచారణ చేపట్టనుంది. దీంతో హైకోర్టు ఎలాంటి షాక్ ఇస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. బెంగాల్ ఇదే తరహాలో ఓ ఎమ్మెల్యే సభ్యత్వం రద్దుచేశారు.



# హుజూరాబాద్ బీఆర్ఎస్‌లో ముసలం

**హుజూరాబాద్, మహా:** హుజూరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. గత కొంత కాలంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు, వ్యవహారశైలిపై విసిగిపోయిన స్థానిక నేతలు, అనుచరులు త్వరలో పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే భవిష్యత్ కార్యాచరణపై జమ్మికుంటలో రహస్య సమావేశం నిర్వహించారు. సుమారు వందమందికిపైగా పాల్గొన్న ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. శుక్రవారం రాత్రి జరిగిన రహస్య సమావేశంలో పలువురు నేతలు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహారశైలిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల కౌశిక్ రెడ్డి నిర్ణయాల వల్ల నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడే వారిని కాదని, తన సొంత అజెండాను అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ముసలం కాస్త పార్టీ ఫిరాయింపుల వైపు దారితీసేలా కనిపిస్తోంది. ఇప్పటికే అసంతృప్తి నేతలు కొందరు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. త్వరలోనే జిల్లా మంత్రి సమక్షంలో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు హస్తం గూటికి చేరే అవకాశం ఉందన్న ప్రచారం జోరందుకుంది. ఈ వ్యవహారంపై గులాబీ బాస్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

# ఏప్రిల్ లో మోదీ సభ

మొదటి పేజీ తరువాయి)

ఈ మూడింటిలో కనీసం రెండు మేయర్ పదవులను దక్కించుకోవడంతో పాటు మరో కార్పొరేషన్ లో బలమైన శక్తిగా ఎదిగాలని తద్వారా రాబోయే ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని ప్రజల్లోకి బలమైన సంకేతాలను తీసుకు వెళ్లాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి నుంచి పార్టీ శ్రేణులను గ్రేటర్ ఎన్నికలకు కార్యోన్ముఖులను చేసేందుకు నేతలు నిర్ణయించారు. తమిళనాడు ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను తెలంగాణకు రప్పించి కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలతో పాటు ఒక భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాష్ట్ర నేతలు భావిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఏప్రిల్ రెండవ వారంలో తెలంగాణలో పర్యటించే విధంగా పీఎంఓ అధికారులతో సంప్రదింపులను ప్రారంభించారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో భారీ సభను నిర్వహించడానికి కూడా ప్రణాళికలను రచిస్తోంది. ప్రధాని పర్యటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ బిజెపి నేతలతో ప్రత్యేక భేటీ నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పార్టీ బలం, ప్రజాభిప్రాయం ఏవిధంగా ఉంది.. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం వంటి అంశాల పైన భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆరా తీసే అవకాశం ఉంది. రాష్ట్రంలో పార్టీ నిర్మాణంతో పాటు పంచాయతీ ఎన్నికలు, మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఓట్లు, తదితర అంశాలన్నింటిపై ఈ సమావేశంలో చర్చించి పీఎంఓకు ఒక నివేదికను ఇవ్వాలని రాష్ట్ర పార్టీ నిర్ణయించింది. ప్రధాని రాష్ట్ర పర్యటన సందర్భంగా బీబీనగర్ ఎయిమ్స్ ప్రారంభోత్సవం సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేలా ఏర్పాట్లు చేయనున్న నేపథ్యంలో పార్టీ పాత్ర, అధికారులతో సమన్వయం తదితర అంశాలపై కిషన్ రెడ్డి ఏర్పాటు చేసే సమావేశంలో చర్చించే అవకాశాలున్నాయి. మున్సిపల్ ఎన్నికల కోసం పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించనున్న సభతో పార్టీకి దిశా నిర్దేశం చేయాలని, వారిని రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళ్లేలా చూడాలని బిజెపి యోచిస్తోంది. ప్రధాని మోదీ పర్యటన పైన రాష్ట్ర నాయకులు స్థానిక నేతలకు ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. ప్రధాని మోదీ పర్యటన రాష్ట్ర పార్టీకి ఒక బిగ్ బూస్ట్ అవుతుందన్న అభిప్రాయాన్ని నేతలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి గతంతో పోలిస్తే ఇటీవల జరిగిన ఎన్నికలలో బిజెపి ఓటు షేర్ చాలా పెరిగింది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలలో బిజెపి గతం కంటే మెరుగుపడింది. 2028 అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్ గా వెళ్ళాలని గత కొంత కాలంగా కేంద్ర పార్టీ రాష్ట్ర నాయకత్వానికి సూచిస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన ద్వారా అసెంబ్లీ ఎన్నికలకు కూడా కొంత ప్లస్ అవుతుందని అంటున్నారు.

# ఒకటి.. రెండు కాదు.. 24 సార్లు

(మొదటి పేజీ తరువాయి)

తొలుత పోలీసుల విచారణలో నిందితులు డ్రగ్స్‌ను సిమ్లాలో ఉన్న ఓ పరిచయస్తుడి ద్వారా తీసుకువచ్చినట్లు బుకాయించారు. అయితే, నిందితులను తమదైన శైలిలో సిట్ అధికారులు విచారించడంతో అసలు నిజాలు బయటపడ్డాయి. సిమ్లా కథ అంతా కట్టుకథ అని, డ్రగ్స్‌ను హైదరాబాద్‌లోనే కొనుగోలు చేసినట్లు తేలింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉంటూ డ్రగ్స్ దందా నడుపుతున్న అభిషేక్ సింగ్ వద్ద.. రోహిత్ రెడ్డి డ్రైవర్, వ్యక్తిగత సహాయకుడు అయిన శరత్ ఈ కొకైన్‌ను కొనుగోలు చేశాడు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఈ లావాదేవీలు జరిగినట్లు సిట్ గుర్తించింది. గతంలో సుమారు 24 సార్లు అభిషేక్ సింగ్ ద్వారానే రోహిత్ రెడ్డి బృందానికి డ్రగ్స్ సరఫరా జరిగినట్లు విచారణలో వెల్లడవ్వడం ఈ కేసు తీవ్రతను తెలియజేస్తోంది.

**సెల్ ఫోన్ డేటాపై సిట్ ఫోకస్.. వణుకుతున్న బడాబాబులు**

అభిషేక్ సింగ్ అరెస్ట్‌తో హైదరాబాద్ డ్రగ్స్ నెట్‌వర్క్‌లో బడాబాబుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రస్తుతం సిట్ అధికారులు అభిషేక్ సింగ్ సెల్‌ఫోన్ డేటాను అత్యంత నిశితంగా విశ్లేషిస్తున్నారు. అతడి కాల్ డేటా, వాట్సాప్ చాట్స్, కాంటాక్ట్ లిస్ట్ ఆధారంగా అభిషేక్ నుంచి ఇంకా ఎవరెవరు డ్రగ్స్ కొనుగోలు చేశారు? ఈ వ్యవహారంలో టాలీవుడ్ సినీ ప్రముఖులు, ఇతర రాజకీయ నాయకులు, బడా వ్యాపారవేత్తల ప్రమేయం ఏమైనా ఉందా? అన్న కోణంలో కూపీ లాగుతున్నారు. ప్రధానంగా దుబాయ్‌కి చెందిన రియల్ ఎస్టేట్ లావాదేవీలు, గతంలో అనుమానాస్పదంగా మరణించిన టాలీవుడ్ నిర్మాత కేదార్‌తో వీరికి ఉన్న పాత సంబంధాలపైనా లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

**స్విమ్మింగ్ పూల్ నీటి నమూనాలు, కాల్పుల కలకలం**

ఫామ్‌హౌస్‌పై పోలీసులు దాడి చేసిన సమయంలో అక్కడ ఉన్న వ్యాపారవేత్త నమిత్ శర్మ పోలీసులను భయపెట్టేందుకు గాలిలోకి కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఆ గందరగోళంలో సాక్ష్యాలను మాయం చేసేందుకు నిందితులు డ్రగ్స్‌ను అక్కడే ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో పడేసి ఉంటారనే అనుమానంతో అధికారులు ఆ నీటి నమూనాలను కూడా సేకరించి ల్యాబ్‌కు పంపారు. కాల్పులు జరిపిన నమిత్ శర్మతో పాటు రోహిత్ రెడ్డి సోదరుడు రితేష్ రెడ్డిలపై హత్యాయత్నం కింద, ఆయుధ చట్టం కింద కేసులు కూడా నమోదయ్యాయి. ఈ పార్టీలో ఏపీకి చెందిన ఓ ఎంపీ సైతం పాల్గొనడం అప్పట్లో రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. కేవలం బడాబాబులనే కాకుండా, డ్రగ్స్ పార్టీ కోసం నాటుకోళ్లు సరఫరా చేసిన స్థానిక వ్యాపారి రమేష్‌ను సైతం అధికారులు విచారణ నిమిత్తం అరెస్ట్ చేశారు.

**ముందు మరిన్ని కీలక పరిణామాలు**

ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ప్రధాన నిందితుడు పైలట్ రోహిత్ రెడ్డి, నమిత్ శర్మ తదితరులను కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారించేందుకు సిట్ సిద్ధమవుతోంది. కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకున్న అనంతరం డ్రగ్ సప్లయర్ అభిషేక్ సింగ్‌ను, ఇతర నిందితులను ఎదురెదురుగా కూర్చోబెట్టి ప్రశ్నిస్తే మరింత కీలక సమాచారం బయటకు వస్తుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఫామ్ హౌస్ చుట్టుపక్కల ఉన్న దాదాపు 100 సీసీ కెమెరాల ఫుటేజీలను సైతం సిట్ బృందం జల్లెడ పడుతోంది.

# భారత్‌కు ఎనర్జీ షాక్

ఇది ఏడాదికి దాదాపు 20 బిలియన్ డాలర్ల నష్టం కలిగించే అవకాశం ఉందని ఖతార్ ఎనర్జీ మంత్రి చెప్పారు. ఈ దాడుల్లో రెండు ప్రధాన ఎల్ఎన్‌జీ యూనిట్లు, ఒక గ్యాస్‌టు లిక్విడ్స్ ఫెసిలిటీ దెబ్బతిన్నాయి. వీటిని పునర్నిర్మించడానికి మూడు నుంచి ఐదేండ్లు పట్టొచ్చు. మొత్తం నష్టం సుమారు 26 బిలియన్ డాలర్ల వరకు ఉండవచ్చని అంచనా. ప్రపంచంలో ఎల్ఎన్‌జీ సరఫరాలో కీలక పాత్ర పోషించే రాస్ లఫాన్ కేంద్రం సాధారణంగా ప్రపంచ సరఫరాలో దాదాపు 20 శాతం వాటా కలిగి ఉంటుంది. కాబట్టి ఈ కేంద్రం దెబ్బతినడం గ్లోబల్ ఎనర్జీ మార్కెట్‌పై తీవ్రమైన ప్రభావం చూపుతోందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

**భారత్‌పై ప్రభావం**

భారత్ తన ఎల్ఎన్‌జీ అవసరాల్లో సుమారు 40 శాతాన్ని ఖతార్ నుంచి దిగుమతి చేసుకుంటుంది. కాబట్టి ఈ దాడి భారత్‌కు నేరుగా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు చెప్తున్నారు. దీంతో గ్యాస్ ధరలు, విద్యుత్ ఉత్పత్తి ఖర్చులు పెరగొచ్చనీ, ఎరువుల తయారీపై ప్రభావం పడుతుందనీ, ఎల్పీజీ సరఫరాలో అంతరాయం కలుగుతుందని హెచ్చరిస్తున్నారు. ఇక ఖతార్ ఇప్పటికే ఇటలీ, బెల్జియం, దక్షిణ కొరియా, చైనా వంటి దేశాలకు ఎల్ఎన్‌జీ సరఫరా ఒప్పందాలను తాత్కాలికంగా నిలిపివేసే అవకాశం ఉందని తెలిపింది.

## పులి బక్కపడినంత మాత్రాన..

# చారకలు పోవు

**ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తా**

**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మహా :** మాటకు మాట జవాబు కాదని, సమయం వచ్చినపుడు తన సత్తా ఏమిటో చూపిస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. షామీర్ పేటలోని తన నివాసంలో ఈటల రాజేందర్ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. తనకు శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన వారిని ఉద్దేశించి మాట్లాడిన రాజేందర్

**పార్టీలు సిద్ధాంతాలు వేరు కావచ్చు కానీ సమాజ హితం కోరుకున్న వారు**

చాలా మంది వచ్చారన్నారు. మాలాంటి వారికి శక్తి ప్రజలే ప్రసాదిస్తారనేందుకు ఇది ఒక గొప్ప నిదర్శనమన్నారు. నాయకుడికి డిగ్నిటీ ఉండాలి, నాయకుడు తన చరిత్రను హోదాను బట్టి సమాజంలో ఉన్న ప్రతిష్టను బట్టి వ్యవహరించాలి తప్ప భిన్నంగా వ్యవహరించకూడదని, అలా వ్యవహరిస్తే తప్పవుతుందన్నారు. ఎవరో మాట్లాడుతున్నారని మనం కూడా మాట్లాడాలనడం సరికాదని, స్పందించకపోతే ఆలోచించటం లేదు అని మాత్రం అనుకోవద్దన్నారు. ప్రతి దానికి పరిష్కారం ఉంటుందన్నారు. ఎన్నో దెబ్బలు తగిలాయి, అనేక గాయాలయ్యాయి. మాతో పెట్టుకోవడం అంటే ధర్మంతో పెట్టుకున్నట్టే అని అనేకసార్లు చెప్పాను. మేము ఒకరి మేలుకోరే వారం తప్ప కీడు కోరే వారం కాదన్నారు. నిండు కుండ తొణకదు, రక్తం చిందించి, కొట్లాడి, ఇష్టపడి తెచ్చుకున్న తెలంగాణ అని అన్నారు. అప్పుడు ఏం జరిగిందో ఇప్పుడు ఏం జరుగుతుందో అన్నీ తెలుసు. ధర్మం తాత్కాలికంగా ఒడిదుడుకులకు గురి అవుతున్నట్లు కనిపించవచ్చు. డబ్బులు ఇచ్చి మేనేజ్ చేసి అనుకూలంగా వార్తలు రాసుకోవచ్చు. కానీ అంతిమ విజయం ధర్మానిది మాత్రమే అని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు.



తెలంగాణ తెచ్చుకున్నది దోపిడీ కోసమో, దొంగల కోసమో, పేదల భూములు గుంజుకునే వారి కోసమో, ఇళ్లను కూలగొట్టే వారి కోసమో, దొంగలే దొరల్లాగా చలామణి అయ్యే వారి కోసం కాదన్నారు. అధికారంలో ఉన్నవారికి వ్యతిరేకంగా ఇప్పటికిప్పుడు నోళ్లు పెగలకపోవచ్చు. కానీ ఆ సందర్భం వచ్చినప్పుడు కూకటి వేళ్ళతో ఎలా పెకిలిస్తారో మనం ఇప్పటికే చూశామన్నారు. తెలంగాణ ప్రజలు కూడా లౌక్యం నేర్చుకున్నారని, ఎప్పుడు ఎలా మాట్లాడాలో తెలుసుకున్నారన్నారు. డబ్బులు సంపాదించుకోవడం కోసం రాజకీయాలకు రాలేదు, వ్యాపారంలో ఉండి రాజకీయాల్లోకి వచ్చామన్నారు. అప్పట్లోనే ఈటలతో పెట్టుకోవద్దని చాలెంజ్ చేసిన వాడిని అని గుర్తు చేశారు. పులి బక్కపడ్డ పులి చారకలు పోవు, అవమానాల నుండి అణిచివేతల నుండి అనేక ఘర్షణలు వస్తాయి, ఘర్షణల నుంచి మార్పు వస్తుంది, ఆ ఘర్షణల నుంచి ప్రజలకి మేలు జరుగుతుందని నమ్మేవాడినని చెప్పారు. కులానికి, మతానికి, ఒక నియోజకవర్గానికి మాత్రమే పరిమితం కాకుండా తెలంగాణ యావత్ ప్రజలు ప్రేమించే బిడ్డగా ఉన్నానని, తెలంగాణ ప్రజల ఆలోచన ఏముంటుందో నా ఆలోచన కూడా అదే ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజల ఆలోచన ఆరాటం సఫలం అయ్యేవిధంగా కార్యాచరణ ఉంటుందని, పదవుల కోసం పెదవులను మూసే వాడిని కాదని, ప్రలోభాలకు తలొగ్గే వాడిని కాదని ఇప్పటికే నిరూపించుకున్నానని అన్నారు. ఉన్నంతకాలం ప్రజల పక్షాన ధర్మం, న్యాయం పక్షాన ఉంటానని హామీ ఇస్తున్నానని పేర్కొన్నారు.

# పసిడి నేలచూపు

**హైదరాబాద్, మహా.:** ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పసిడి ధరలు ఒక్కసారిగా నేలచూపులు చూడటంతో దేశవ్యాప్తంగా సామాన్యులు, పసిడి ప్రియుల ముఖాల్లో చెప్పలేనంత ఆనందం వెల్లివిరుస్తోంది. గడచిన పది రోజుల వ్యవధిలోనే భారత బులియన్ మార్కెట్ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో బంగారం ధరలు పేకమేడలా కుప్పకూలాయి. ఏకంగా 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారంపై రూ.13,320, అలాగే 22 క్యారెట్ల ఆభరణాల బంగారంపై రూ.12,160 మేర ధరలు కరిగిపోవడం మార్కెట్ వర్గాలనే తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. రాబోయే పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ నేపథ్యంలో కొండెక్కిన ధరలను చూసి ఆందోళన చెందిన సగటు మధ్యతరగతి జీవికి ఈ భారీ పతనం నిజంగా ఒక వరం లాంటిది. ఒకవైపు పెట్టుబడిదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న ఈ ఊహించని పరిణామం.. మరోవైపు కొనుగోలుదారులకు మాత్రం కలలో కూడా ఊహించని సువర్ణావకాశాన్ని తెచ్చిపెట్టింది. ధరలు దిగిరావడంతో దేశవ్యాప్తంగా ఉన్న ప్రతి జ్యువెలరీ దుకాణం వినియోగదారులతో కిటకిటలాడుతూ సరికొత్త పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది

**పది రోజుల్లో ఏ స్థాయిలో క్షీణించిందంటే.**

గత పది రోజుల్లో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పతనమయ్యాయి. మార్కెట్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచేలా 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారంపై ఏకంగా రూ.13,320 మేర భారీ తగ్గింపు నమోదైంది. ఈ భారీ పతనంతో ప్రస్తుతం మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,900 వద్ద స్థిరపడింది. అదే విధంగా ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల పసిడి కూడా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పతనమైంది. పది రోజుల్లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ.12,160 మేర ధర కరిగిపోయింది. దీంతో ప్రస్తుతం మార్కెట్లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం తాజా ధర రూ.1,36,540కి పడిపోయింది. పది రోజుల వ్యవధిలోనే పదిహేను వేల రూపాయలకు చేరువలో ధరలు పడిపోవడం చరిత్రలో అరుదుగా జరిగే పరిణామం అని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**రాష్ట్రాల వారీగా కొనుగోళ్లు**

ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా బంగారాన్ని వినియోగించే దేశాల్లో చైనా తర్వాత భారతదేశం రెండవ స్థానంలో ఉంది. తాజా గణాంకాల ప్రకారం, భారతీయ కుటుంబాల వద్ద ఏకంగా 34,600 టన్నుల బంగారం నిల్వలు ఉన్నట్లు అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీని విలువ భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు 88.8 శాతానికి సమానం కావడం గమనార్హం. రాష్ట్రాల వారీగా చూసుకుంటే, దక్షిణ భారతదేశం పసిడి కొనుగోళ్లలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్న బంగారంలో దాదాపు 40 శాతానికి పైగా వాటా కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలదే కావడం విశేషం. కేరళలో ప్రతీ వివాహానికి సగటున అత్యధిక మొత్తంలో బంగారాన్ని బహుమతిగా ఇచ్చే సంప్రదాయం ఉండటంతో ఆ రాష్ట్రం కొనుగోళ్లలో ఎప్పుడూ ముందుంటుంది. ఆ తర్వాతి స్థానాల్లో తమిళనాడు, రెండు తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర, గుజరాత్ నిలుస్తున్నాయి. దక్షిణ భారతీయులకు బంగారం కేవలం ఒక పెట్టుబడి మాత్రమే కాదు, అది ఒక సెంటిమెంట్ మరియు హోదాకు చిహ్నం.

**రోజువారీ కొనుగోళ్లు, మార్కెట్ విశ్లేషణ**

భారతదేశంలో సగటున ఏడాదికి 750 నుంచి 800 టన్నుల బంగారాన్ని వినియోగిస్తున్నారు. ఈ లెక్కన చూసుకుంటే మన దేశంలో ప్రతిరోజూ దాదాపు 2.19 టన్నుల (2,190 కిలోల) బంగారం అమ్ముడవుతోంది. భారతీయుల ఆర్థిక ప్రణాళికలో పసిడికి ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. కుటుంబ సంపదలో దాదాపు 16 శాతం కేవలం బంగారం రూపంలోనే ఉందంటే పసిడిపై మనకున్న నమ్మకం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు (ఈక్విటీ మార్కెట్లలో సగటు పెట్టుబడులు కేవలం 5 శాతం మాత్రమే ఉండటం గమనార్హం). ఇప్పుడు పది రోజుల వ్యవధిలోనే రూ.13 వేలకు పైగా ధరలు తగ్గడంతో ఈ రోజువారీ అమ్మకాల సంఖ్య అమాంతం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ధరలు తగ్గినప్పుడే కొనుగోలు చేసి, భవిష్యత్తు కోసం భద్రపరుచుకోవాలనే మధ్యతరగతి ప్రజల ఆలోచనా విధానం జ్యువెలరీ మార్కెట్లకు సరికొత్త కళను తీసుకొచ్చింది. మొత్తం మీద ప్రస్తుత ఈ భారీ పతనం పసిడి మార్కెట్ చరిత్రలో ఒక సంచ

# మసీదులు ఈద్గాల సమగ్ర అభివృద్ధికి కృషి

- నిరుపేద ముస్లిం కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత
- ప్రార్థనా మందిరాల మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కేటాయింపు
- ఖబ్రస్తాన్ల రక్షణ అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా :** రంజాన్ పర్వదినం క్రమశిక్షణకు సోదరభావానికి ప్రతీక అని ఈ పండుగ సమాజంలో శాంతిని వెల్లివిరియజేస్తుందని రంజాన్ కేవలం ముస్లిం సోదరుల పండుగే కాకుండా సమస్త మానవాళికి ఒక సందేశమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పవిత్ర రంజాన్ పండు గను పురస్కరించుకుని శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు మసీదులు, ఈద్గాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఆయన వారికి హృదయపూర్వక ఈద్ ముబారక్ తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని గడపడం గొప్ప విషయమన్నారు. రంజాన్ మాసం నేర్పిన త్యాగ నిరతి దాతృత్వం ఏడాది పొడవునా కొనసాగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని మసీదులు ఈద్గాలు అదేవిధంగా ఖబ్రస్తాన్ల అభివృద్ధిపై తనకు ప్రత్యేక దృష్టి ఉందని వాటి పునర్నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముస్లిం మైనారిటీల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ప్రభుత్వ పరంగా అందాల్సిన ఫలాలను ప్రతి పేదవాడికి చేరేలా చూస్తానని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన దేశంలో అన్ని మతాల వారు సోదరభావంతో కలిసి ఉండాలని కోరారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, నాయకులు ముత్యాల విశ్వనాథం, పూర్ణచందర్ రావు, సాయిబాబా, రాహుల్, మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి, అబీద్ హుస్సేన్, ఉమర్ ఫరూక్, జహంగీర్, అమీర్ ఖాద్రి, అబ్దుల్ కరీమ్, జుబేర్, జావేద్, కార్పొరేటర్లు సాయిబాబా, విశ్వేశ్వర్ రావు, బోయిన విజయ్ కుమార్, బండి నర్సింహా, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ నమాజ్





**మణుగూరు, మహా :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మణుగూరు పట్టణంలో ముస్లిం సోదరులు ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఏరియా స్టోర్ సమీపంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రార్థనలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఈద్గాల వద్ద సందడి నెలకొని, సోదరభావం, సామరస్యానికి ప్రతీకగా పండుగ వాతావరణం కళకళలాడింది. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ఈద్గాలకు విచ్చేశారు. పీరినాకి నవీన్, కలబోయిన మాధవరావు, పాలమూరు రాజు, సామా శ్రీనివాస్ రెడ్డి, గాండ్ల సురేష్, డి వెంకటప్పయ్య, దున్నపోతుల శ్రీనివాస్, జీవరత్నం, అశోక్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మణుగూరు ఎస్డీపీఓ వి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సిఐ నాగబాబు సహా పోలీస్ సిబ్బంది విస్తృతంగా మోహరించగా, ఈద్గాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. మణుగూరు పట్టణంలోని ఏరియా స్టోర్స్, పీవి కాలనీ ప్రాంతాల్లోని ఈద్గాలను డీఎస్పీ రవీందర్ రెడ్డి, సిఐ నాగబాబు పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈద్గా ముస్లిం సోదరులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రార్థనలు, ఉపవాసాల అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రేమ, శాంతి, సౌహార్దానికి ప్రతీకగా ఈద్ పండుగ మణుగూరులో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా కొనసాగింది.

## సోలార్ ప్లాంట్ పనితీరుపై ఏరియా జీఎం సమీక్ష

- ప్లాంట్ ఎఫిషియెన్సీ పెంపు, డౌన్‌టైమ్ తగ్గింపుపై సూచనలు
- రిటైర్మెంట్ సందర్భంగా సీతారాంకు సత్కారం



**మణుగూరు, మహా :** మణుగూరు ఏరియాలో ఏర్పాటు చేసిన 33 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ జీఎం ఇ అండ్ ఎం, సోలార్ ఎనర్జీ విభాగానికి చెందిన బి సీతారామ్ శనివారం సంబంధిత అధికారులతో కలిసి సందర్శించి ప్లాంట్ పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రోజువారీ విద్యుత్ ఉత్పత్తి సగటు, పీక్ జనరేషన్ సామర్థ్యం, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్, కేపాసిటీ యుటిలైజేషన్ ఫ్యాక్టర్ వంటి కీలక సాంకేతిక అంశాలను పరిశీలించారు. ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న విద్యుత్ పరిమాణం, గ్రిడ్‌కు సరఫరా అవుతున్న యూనిట్లు, విద్యుత్ నష్టాల నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. ప్లాంట్‌లో అమర్చిన సోలార్ ప్యానెల్స్ సామర్థ్యం, ఇన్వర్టర్ల పనితీరు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్విచ్‌యార్డ్ వ్యవస్థల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. సౌర కిరణాల వినియోగాన్ని గరిష్ట స్థాయిలో పొందేందుకు ప్యానెల్స్ క్లీనింగ్ షెడ్యూల్, ట్రాకింగ్ సిస్టమ్, రియల్‌టైమ్ మానిటరింగ్ వ్యవస్థల పనితీరును పరిశీలించారు. అలాగే ప్లాంట్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన బిహెచ్ఈఎల్ సంస్థ అధికారులతో సమావేశమై, పనితీరు మెరుగుదల, బ్రేక్‌డౌన్ తగ్గింపు, ప్రివెంటివ్ మెయింటెనెన్స్, స్పేర్ పార్ట్స్ అందుబాటు, సాంకేతిక నవీకరణలపై సవివరంగా చర్చించారు. ప్లాంట్ ఎఫిషియెన్సీ పెంపు, డౌన్‌టైమ్ తగ్గింపు, భవిష్యత్ విస్తరణ అవకాశాలపై సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాలు, ఎలక్ట్రికల్ సేఫ్టీ చర్యలు, ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు, సిబ్బంది రక్షణ అంశాలను కూడా పరిశీలిస్తూ గ్రీన్ ఎనర్జీ ప్రాధాన్యతను ఆయన ప్రస్తావించారు. అనంతరం జీఎం బి సీతారామ్, ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌ను జీఎం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సింగరేణిలో సుదీర్ఘకాలం సేవలందించి ఈ నెలాఖరులో పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా మణుగూరు విచ్చేసిన ఆయనను దుర్గం రామచందర్ చేతుల మీదుగా ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం బి శ్రీనివాస చారి, ఏజీఎం (ఐఈడి) సిహెచ్ రాంబాబు, ఏరియా ఇంజినీర్ ఆర్ శ్రీనివాస్, డీజీఎం (పర్సనల్) ఎస్. రమేశ్, డీజీఎం (సివిల్) శివప్రసాద్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరభద్రుడు, ఫైనాన్స్ మేనేజర్ రమేశ్, ఐటీ విభాగానికి చెందిన సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- మంత్రి కొండా సురేఖ**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పట్టణ సమగ్ర అభివృద్ధిపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జాటోత్ రామ్ చంద్ర నాయక్‌లతో కలిసి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. భద్రాచలం పునర్‌నిర్మాణం పునరుజ్జీవనం ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం దేశవ్యాప్తంగా భక్తుల విశ్వాసానికి నిలయమని ఆలయం పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యాత్రికుల సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పార్కింగ్ సదుపాయాలు రహదారుల విస్తరణ పరిశుభ్రత పరిరక్షణ వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. మాడ వీధుల అభివృద్ధి కల్యాణ మండప నిర్మాణం రామవనం అభివృద్ధి డిజిటల్ ఇన్ఫర్మేషన్ సెంటర్లు తాగునీటి సరఫరా శుభ్రమైన మరుగుదొడ్ల ఏర్పాటు వంటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ నెల 27న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. కల్యాణ మండపాన్ని ఆకర్షణీయంగా అలంకరించడంతో పాటు లైటింగ్ నిరంతర విద్యుత్ సరఫరా తాగునీరు మరుగుదొడ్ల వంటి సౌకర్యాలను సమృద్ధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వృద్ధులు దివ్యాంగుల కోసం బ్యాటరీ వాహనాలు అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక చర్యలు అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఇతర అధికారులు, ప్రాజెక్ట్ రూపకర్తలు సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మణుగూరు పోలీస్ స్టేషన్‌కు.. రూ.50 లక్షల సిఎస్ఆర్ నిధులు

**కౌన్సిలింగ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పరిశీలించిన సీఎస్ఆర్ కమిటీ సభ్యులు**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు నూతన పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సింగరేణి సి ఎస్ ఆర్ నిధుల కింద రూ. 50 లక్షలు మంజూరయ్యాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సామాజిక సమస్యల పరిష్కారానికి ఈ హాల్ ఉపయోగపడనుంది. ఏరియా జీఎం రామచందర్ ఆదేశాల మేరకు సిసిఆర్ కమిటీ సభ్యులు శనివారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఓటీజీఎం శ్రీనివాస్ చారి, డీజీఎం పర్సనల్ రమేష్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సిఐ నాగబాబు, సింగరేణి సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం ద్వారా కుటుంబ వివాదాలు, సామాజిక సమస్యలను సౌహార్దపూర్వకంగా పరిష్కరించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## తల్లి మార్గదర్శకత్వంలో జయంత్ నాట్య ప్రతిభ వికాసం



**భద్రాచలం, మహా :** నేటి ఆధునిక యుగంలో పిల్లలకు కేవలం పాఠ్య పుస్తకాల విద్యనే కాకుండా, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడం అత్యంత అవసరంగా మారింది. ఈ దిశగా భద్రాచలానికి చెందిన తల్లి జ్యోతి తన కుటుంబంలోనే ఒక మంచి ఆదర్శంగా నిలుస్తోంది. ఆమె తన రెండో కుమారుడు జయంత్‌కు విద్యాభ్యాసంతో పాటు సాంప్రదాయ కళలపై శ్రద్ధ పెంచుతూ సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి మార్గం సుగమం చేస్తోంది. చిన్న వయసులోనే జయంత్ భారత నాట్యంపై ఆసక్తి పెంపొందించుకొని, తక్కువ కాలంలోనే మంచి ప్రావీణ్యం సంపాదిస్తుండటం విశేషం. ఇటీవల బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించిన నాట్య ప్రదర్శనలో జయంత్ తన ప్రతిభను చాటుకున్నాడు. అతని హావ భావాలు, లయబద్ధమైన అడుగులు, అభినయ నైపుణ్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రతి కదలికలోనూ అతని శ్రద్ధ, సాధన స్పష్టంగా కనిపించడంతో అందరూ ప్రశంసల వర్షం కురిపించారు. స్థానిక సేవా సమితి ఆధ్వర్యంలో దేవాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయంత్ మరోసారి తన నాట్య ప్రతిభను ప్రదర్శించాడు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, స్థానికులు, బంధువులు తక్కువకాలంలోనే నైపుణ్యంతో భారతనాట్యం ప్రదర్శించడము అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో జయంత్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లి జ్యోతి మార్గదర్శకత్వంలో జయంత్ విద్యలోనూ, కళలలోనూ సమాన ప్రాధాన్యం కల్పించుకుంటూ ముందుకు సాగుతున్నాడు. పిల్లలలో సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడం ఎంత ముఖ్యమో ఈ కుటుంబం ద్వారా స్పష్టమవుతోంది. యువతలో సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత. జయంత్ తండ్రి శ్రీనివాస్ భద్రాచల రామాలయ ఉద్యోగి. ఆధునిక విద్యతో పాటు సాంప్రదాయ కళలను అలవరచుకోవడం ద్వారా పిల్లలు సమగ్ర అభివృద్ధి సాధించగలరనే భావన ఈ సందర్భంలో మరింత బలపడింది.

## సారపాకలో ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు



**బూర్గంపహాడ్, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక పెద్ద మస్జిద్ (దావత్ ఈద్గా), తాళ్లగుమ్మూరులో శనివారం ఈద్ ఉల్ ఫితర్ పర్వదినం ఘనంగా నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు, సోదరులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్ ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 700 మంది భక్తులు ప్రశాంత వాతావరణంలో నమాజ్ నిర్వహించి, అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ రంజాన్ పర్వదినం సోదర భావం, ప్రేమ, సహనం, దాతృత్వాన్ని పెంపొందించే పవిత్ర సమయం అని పేర్కొన్నారు. ఈ పండుగ అందరి జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు మస్తాన్, గుల్ మొహమ్మద్, రహమత్ పాషా తదితరులు, అలాగే ముస్లిం మత పెద్దలు, వివిధ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## అద్దంకి దయాకర్‌పై అసభ్య పోస్ట్.. పోలీసులకు ఫిర్యాదు




**చర్ల మహా :** జాతీయ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ శాసన మండలి విప్ అద్దంకి దయాకర్ పై అనుచిత వ్యాఖ్యలకు సంబంధించి చర్ల మండలంలో గల సీనియర్ ప్రెస్ క్లబ్ గ్రూప్ లో ఒక వ్యక్తి అసభ్యకరంగా పోస్టు పెట్టడం వల్ల అతనిపై చర్యలు తీసుకోవాలంటూ జాతీయ మాల మహానాడు రాష్ట్ర నాయకులు తడికల లాలయ్య , కొంగూరు రమణారావు , దొడ్డ ప్రభుదాసు ,జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణ మూర్తి , జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఏడెల్లి గణపతి , నియోజకవర్గ అధ్యక్షులు కారంపూడి సాల్మన్ రాజు , మండల గౌరవ అధ్యక్షులు మోతుకూరి ప్రభాకర్ రావు గార్ల నేతృత్వంలో చర్ల సీఐ రాజువర్మ గారిని కలిసి తమ నాయకుని పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ రిపోర్టు అందజేస్తున్న మాలమహానాడు నాయకులు. పాల్గొన్న నాయకులు కొంగూరు సత్యనారాయణ , తోటమల్ల కృష్ణారావు , ఇప్పా ప్రభుదాస్ , కొంగూరు శ్యామసుందర్ , పరవ బాలరాజు తదితరులు పాల్గొన్నారు

## తల్లాడలో ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు



**తల్లాడ (మహా) :** తల్లాడలో రంజాన్ పర్వదిన వేడుకలను శనివారం ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తల్లాడకు చెందిన షేక్ మెహరాజ్ రోబో స్వగృహానికి పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక సేమియాలను ఆరగించి ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు. తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు చిన్నబ్బాయి, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, తల్లాడ నాయకులు గుంటుపల్లి వెంకటయ్య, దగ్గుల శ్రీనివాసరెడ్డి, దుండేటి వీరారెడ్డి, రాయల రాము, ధూపాటి భద్రరాజు, పొన్నం కృష్ణయ్య, చల్ల నాగులు తదితరులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 30 రోజులు పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టి పండుగను జరుపుకోవడం సంతోషకరమన్నారు. పలువురు మీడియ మిత్రులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## బూర్గంపహాడ్‌లో మళ్లీ దొంగల హల్‌చల్



**బూర్గంపహాడ్, మహా :** బూర్గంపహడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్ద మోరీల సమీపంలో దొంగలు మళ్లీ రెచ్చిపోయారు. గతంలోనే రైతుల మోటర్లు, స్టార్టర్లు పలుమార్లు దొంగతనం చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇటీవల క్లసర్ మిల్లులో జనరేటర్ దొంగతనం చేస్తుండగా రైతులు దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించిన తర్వాత పరిస్థితి సర్దుకుంది అనుకుంటున్న సమయంలో, మరోసారి దొంగతనానికి పాల్పడ్డారు. గత రాత్రి ముగ్గురు రైతులకు చెందిన విద్యుత్ మోటర్ల కనెక్షన్లు తొలగించి, ఒక మోటార్‌ను ఎత్తుకెళ్లి, మిగిలిన రెండు మోటర్లను ప్రధాన రోడ్డుకు సమీపంలో వదిలి పారిపోయారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

## ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా.. అటవీశాఖ సిబ్బంది బైక్ ర్యాలీ



**మణుగూరు, మహా :** ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీశాఖ అధికారులు మణుగూరు నుండి అశ్వాపురం మీదగా భద్రాచలం క్రాస్ రోడ్డు వరకు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యంగా అటవీశాఖ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా అడవుల ప్రాధాన్యత, వృక్షారోపణ అవసరం గురించి అధికారులు ప్రజలకు వివరించారు. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ లక్ష్మయ్య, ఎఫ్ఎస్ఓ నాగరాజు, ఎఫ్ఎస్ఓ రామచంద్రయ్యలు పాల్గొన్నారు.

## పోలవరం సమీపంలో.. ఘోర రోడ్డు ప్రమాదం



**బూర్గంపహాడ్, మహా :** మండల పరిధిలోని పోలవరం సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరికొంతమందికి తీవ్ర గాయాలు అయ్యాయి, ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రయాణికులు వాహనంలో ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న వాహనం అదుపు తప్పడంతో ఢీకొనడం వల్ల ఈ దుర్ఘటన జరిగినట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. రోడ్లలో మలుపులు ఎక్కువగా ఉండడం, వేగం నియంత్రణ లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

## పమ్మి రాజ్ కమల్ చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ సర్పంచ్



**తల్లాడ (మహా) :** నూతనకల్ గ్రామంలో పమ్మి రాజ్ కమల్ అనారోగ్యం కారణంగా ఇటీవల స్వర్గస్తులైనారు. శనివారం నిర్వహించిన దశదిన కార్యక్రమంలో నూతనకల్ మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు , తల్లాడ మండల రైతు సంఘం అధ్యక్షులు కళ్యాణపు కృష్ణయ్య , నూతనకల్ గ్రామ కమలేశ్వర శివాలయం చైర్మన్ కళ్యాణపు శ్రీనివాసరావు, పమ్మి కృష్ణారావు రాజా చిత్రపటానికి పూలతో ఘన నివా ళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని పరామర్శించారు.



## జీవన స్వరాలు

నాటి రాజులు మేటి రాజులు
నేటి నేతలు మేధ యోధులు
ప్రజల బాధలు రాజు బాధలు
జనత గోసలు నేత చేరవు

పేరు గొప్పది పేరు మారెను
లోహరథాల పొగల రోతలు
తిండి కల్తీ గుండె జబ్బులు
మత్తు నగరం మనీ ముఖ్యం

బోడి ఊహలు కోడి ఈకలు
ప్రశ్న లోయలు శూన్య దారులు
కాళ్ల బొబ్బలు కడుపు మంటలు

తిరుగు బాటే జరుగు బాటూ
మబ్బుల వెనుక వెన్నల తునక
మాటల వెనుక మంటల వేడి
ఆశల తోట అందరి బాట
ముష్టి బిగించు ముందుకు నడువు

కలసి కట్టుగ కదను త్రొక్కిన
కొత్తలోకపు తలుపు తట్టిన
మట్టి మనుషుల మనో వేడుక
తీరగలదూ తీపి గర్తుగ

రేడియమ్
9291527757

## మీఠాపాన్ దోస్తానా



పండగ భోజనం కాగానే పాన్ దాన్ ఆహ్వాని స్తుంది
ఆయాసం మరిచేలా నోటిలో తాంబూలం రాజ్యం !
నమిలినా కొద్దీ మితాపాన్ నాల్క పై చెలిమె చెలిమె !
ఎరుపు రంగుతో నాల్కకు మేకప్ చేస్తుంది మీఠాపాన్

కోపిష్టి సైతం తియ్యటి తాంబూలం నమిలితే
మధురం కోపాన్ని మటు మాయం చేస్తుంది !
ఆలు మగల అలకలు అటకెక్కిపోతాయి
మీఠాపాన్ ఇంద్రజాలం !

ఇచ్చిన పాన్ నమిలినాకా దుష్మన్ బీ దోస్త్ !
మీఠాపాన్ మాయలో పడితే మాటలే మాటలు

అలుగు వారినట్లు ఆశువుగా పద్య పఠనం
"వహ్వా " పదాల ముషాయిరా !

మీఠాపాన్ లు కట్టించే
చిన్న పాన్ కోకా సైతం అంగడంగడే
దసరా రంజాన్ పండగ లెక్క సందడి

అందరూ మీఠాపాన్ అభిమానులే
కులం లేదు మతం లేదు ప్రాంతం లేదు !
అందరి నోట మీఠాపాన్ షోకు

-- కందాళై రాఘ-
వాచార్య

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# మూసీకి కొత్త జీవం నగరానికి శాశ్వత వరం



హైదరాబాద్ నగరానికి జీవనాడిగా పరిగణించబడే మూసీ నది నేడు గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. ఒకప్పుడు నగరానికి తాగునీరు, సాగునీరు అందించిన ఈ నది కాలక్రమేణా నిర్లక్ష్యం, అక్రమ కబ్జాలు, పారిశ్రామిక కాలుష్యం కారణంగా దుర్వ స్థితికి చేరుకుంది. నగర విస్తరణ వేగం పెరిగిన కొద్దీ మూసీ ప్రాధాన్యం తగ్గిపోయింది. నగర అభివృద్ధి పేరిట జరిగిన అక్రమ కబ్జాలు, మురుగు కాలువల అనుసంధానం, చెత్త పారవేత వంటి చర్యలు మూసీని ఒక నది నుంచి మురుగు కాలువగా మార్చాయి. ఒకప్పుడు ఔషధ గుణాలు ఉన్న నీటి వనరుగా పేరొందిన మూసీ, నేడు కాలుష్యానికి ప్రతీకగా మారడం నగరానికి ఒక పెద్ద పర్యావరణ సమస్యగా నిలిచింది. అయితే ఇప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం మూసీ పునరుజ్జీవనాన్ని ఒక సమగ్ర అభివృద్ధి కార్యక్రమంగా తీసుకోవడం నగర భవిష్యత్తుకు ఆశాజనక పరిణామంగా మారింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మూసీ పునరుద్ధరణను కేవలం ఒక సుందరీకరణ ప్రాజెక్టుగా కాకుండా పర్యావరణ పరిరక్షణ, నగర అభివృద్ధి, ప్రజా జీవన ప్రమాణాల మెరుగుదలకు సంబంధించిన సమగ్ర కార్యక్రమంగా రూపుదిద్దుతోంది. తెలంగాణ అసెంబ్లీలో సమర్పించిన ప్రణాళికల ప్రకారం సుమారు 55 కిలోమీటర్ల మేర విస్తరించే మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి ప్రభుత్వం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. మొదటి దశగా బాపుఘాట్ నుంచి గాంధీ సరోవర్ వరకు 21 కిలోమీటర్ల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఈ దశకు దాదాపు రూ.5,812 కోట్ల వ్యయం అంచనా వేయగా, 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రూ.1,500 కోట్లను ప్రత్యేకంగా కేటాయించడం ద్వారా ప్రభుత్వం తన ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేసింది.

ఇంకా ముఖ్యంగా ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ADB) నుంచి సుమారు రూ.4,100 కోట్ల రుణ సహకారం అందించేందుకు ముందుకు రావడం ప్రాజెక్టుకు అంతర్జాతీయ స్థాయి ఆర్థిక మద్దతుగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహకారంతో రూపొందుతున్న ఈ ఫైనాన్స్ మోడల్ మూసీ ప్రాజెక్టును ఒక స్థిరమైన అభివృద్ధి కార్యక్రమంగా మార్చే అవకాశాన్ని కల్పిస్తోంది.

మూసీ చరిత్ర ఎంతో గొప్పది. వికార్‌బాద్ జిల్లా అనంతగిరి కొండల్లో పుట్టి దాదాపు 267 కిలోమీటర్ల మేర ప్రవహించే ఈ నది నల్గొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. ఒకప్పుడు మూసీ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా సాగు జరిగేది. అనేక రకాల చేపలు, జీవ వైవిధ్యం ఈ నదిలో కనిపించేవి. నగర అభివృద్ధి వేగంతో ఈ సహజ సంపద క్రమంగా నశించింది. ప్రస్తుతం మూసీ కాలుష్యం నగర ప్రజల ఆరోగ్యానికి కూడా సవాలుగా మారింది.

మూసీ చరిత్రలో 1908 వరద ఒక పెద్ద మలుపు. ఆ విపత్తులో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత నగరాన్ని రక్షించేందుకు ఓస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ వంటి జలాశయాలను నిర్మించడం జరిగింది. ఈ జలాశయాలు నగరానికి తాగునీరు అందించడమే కాకుండా వరద నియంత్రణలో కూడా కీలక పాత్ర పోషించాయి. అయినప్పటికీ తరువాతి దశాబ్దాల్లో కూడా పలు సార్లు వరదలు సంభవించడం మూసీ పరివాహక ప్రాంతాల ప్రాముఖ్యతను గుర్తుచేస్తూనే ఉంది.

మూసీ పునరుద్ధరణకు గతంలో కూడా పలు ప్రయత్నాలు జరిగాయి. వివిధ ప్రభుత్వాలు పలు పథకాలు ప్రకటించినప్పటికీ అవి పూర్తి స్థాయిలో అమలు కాలేకపోయాయి. నిధుల కొరత, పరిపాలనా సమస్యలు, స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వంటి కారణాలతో ఆ ప్రణాళికలు నిలిచిపోయాయి. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకున్న చర్యలు మాత్రం స్పష్టమైన లక్ష్యాలు, సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయి.

ప్రభుత్వ ప్రణాళికల్లో మూసీని కేవలం శుద్ధి చేయడం మాత్రమే కాకుండా నగర ప్రజలకు ఒక ఆహ్లాదకరమైన ప్రజా స్థలంగా మార్చే దిశలో చర్యలు ఉన్నాయి. బాపుఘాట్ ప్రాంతాన్ని సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయడం, గాంధీ సరోవర్ నిర్మాణం, పచ్చదనంతో కూడిన పార్కులు, నడక మార్గాలు, సైక్లింగ్ ట్రాక్‌లు, వినోద స్థలాల ఏర్పాటు వంటి ప్రతిపాదనలు నగర సౌందర్యాన్ని పెంచేలా ఉన్నాయి. బాపుఘాట్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహం, మ్యూజియం, అన్ని మతాల ప్రార్థనా మందిరాల నిర్మాణం వంటి ప్రతిపాదనలు మూసీని ఒక సాంస్కృతిక సమన్వయ కేంద్రంగా మార్చే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

మరో ముఖ్య అంశం మూసీకి శాశ్వత నీటి ప్రవాహాన్ని కల్పించడం. గోదావరి జలాలను తరలించి మూసీకి నీటి ప్రవాహం పెంచే ప్రణాళికను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ చర్య అమలైతే మూసీ శుద్ధీకరణకు దీర్ఘకాలిక పరిష్కారం లభించే అవకాశం ఉంది. అదే సమయంలో నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న అక్రమ కబ్జాలను తొలగించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. పేదలకు పునరావాసం కల్పిస్తూ, నదిని కాపాడే విధంగా సమతుల్య విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రపంచంలోని అనేక నగరాలు తమ నదులను పునరుద్ధరించి నగర అభివృద్ధికి మార్గదర్శకంగా మార్చుకున్నాయి. లండన్‌లో థేమ్స్ నది, దక్షిణ కొరియాలో సియోల్ నగరంలోని చియోంగ్‌జియోన్ నది ఇందుకు మంచి ఉదాహరణలు. ఒకప్పుడు కాలుష్యానికి గురైన ఆ నదులు ఇప్పుడు ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలుగా మారాయి. అదే తరహా మార్పు మూసీకి కూడా సాధ్యమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మూసీ పునరుజ్జీవనం విజయవంతమైతే అది హైదరాబాద్ నగర అభివృద్ధి చరిత్రలో ఒక కీలక ఘట్టంగా నిలుస్తుంది. పర్యావరణ పరిరక్షణ, పట్టణ సౌందర్యం, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల అన్ని కలిపి ఒక సమగ్ర నగరాభివృద్ధి నమూనాగా ఇది నిలిచే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రుల నేతృత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఈ దిశగా తీసుకుంటున్న చర్యలు నగర భవిష్యత్తుపై కొత్త ఆశలను కలిగిస్తున్నాయి.

రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల సహకారంతో మూసీ పునరుద్ధరణ హైదరాబాద్‌కు శాశ్వత వరంగా మారే అవకాశం ఉంది. నగర అవసరాలు, పరివాహక ప్రాంత రైతుల సాగు, పర్యావరణ పరిరక్షణ ఈ మూడు అంశాలకు మూసీ పునర్జీవనం కీలకం. నదిని కాపాడటం అంటే కేవలం ఒక జలవనరును సంరక్షించడం మాత్రమే కాదు నగర భవిష్యత్తును భద్రపరచడం.తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రయత్నాలు కార్యరూపం దాల్చితే హైదరాబాద్ మరోసారి తన సహజ వైభవాన్ని తిరిగి పొందగలదు. మూసీ పునర్జీవనం విజయవంతమైతే అది కేవలం ఒక నది పునరుద్ధరణగా కాకుండా, భవిష్యత్ తరాలకు పర్యావరణ సమతుల్యతను అందించే చారిత్రక నిర్ణయంగా నిలిచే అవకాశముంది.

**అమరవాజీ నాగరాజు***
**టీపీసీసీ ప్రెసిడెంట్ పీఆర్ఓ***

ఒకప్పుడు ఔషధ గుణాలు ఉన్న నీటి వనరుగా పేరొందిన మూసీ, నేడు కాలుష్యానికి ప్రతీకగా మారడం నగరానికి ఒక పెద్ద పర్యావరణ సమస్యగా నిలిచింది. తెలంగాణలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం ఇపుడు మూసీ పునరుజ్జీవనాన్ని ఒక సమగ్ర అభివృద్ధి కార్యక్రమంగా తీసుకోవడం హైదరాబాద్ నగర భవిష్యత్తుకు ఆశాజనక పరిణామంగా మారింది.

.................................

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మూసీ పునరుద్ధరణను కేవలం ఒక సుందరీకరణ ప్రాజెక్టుగా కాకుండా పర్యావరణ పరిరక్షణ, నగర అభివృద్ధి, ప్రజా జీవన ప్రమాణాల మెరుగుదలకు సంబంధించిన సమగ్ర కార్యక్రమంగా రూపుదిద్దుతోంది.

.........

మూసీ పునరుద్ధరణకు గతంలో కూడా పలు ప్రయత్నాలు జరిగాయి. వివిధ ప్రభుత్వాలు పలు పథకాలు ప్రకటించినప్పటికీ అవి పూర్తి స్థాయిలో అమలు కాలేకపోయాయి. నిధుల కొరత, పరిపాలనా సమస్యలు, స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వంటి కారణాలతో ఆ ప్రణాళికలు నిలిచిపోయాయి. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకున్న చర్యలు మాత్రం స్పష్టమైన లక్ష్యాలు, సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయి.


..............

ప్రపంచంలోని అనేక నగరాలు తమ నదులను పునరుద్ధరించి నగర అభివృద్ధికి మార్గదర్శకంగా మార్చుకున్నాయి. లండన్‌లో థేమ్స్ నది, దక్షిణ కొరియాలో సియోల్ నగరంలోని చియోంగ్‌జియోన్ నది ఇందుకు మంచి ఉదాహరణలు. ఒకప్పుడు కాలుష్యానికి గురైన ఆ నదులు ఇప్పుడు ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలుగా మారాయి. అదే తరహా మార్పు మూసీకి కూడా సాధ్యమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

.......

మూసీ పునరుజ్జీవనం విజయవంతమైతే అది హైదరాబాద్ నగర అభివృద్ధి చరిత్రలో ఒక కీలక ఘట్టంగా నిలుస్తుంది. పర్యావరణ పరిరక్షణ, పట్టణ సౌందర్యం, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల అన్ని కలిపి ఒక సమగ్ర నగరాభివృద్ధి నమూనాగా ఇది నిలిచే అవకాశం ఉంది.

# కల్తీ ముప్పు!



మొన్న సికింద్రాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ దాడుల్లో రెండువేల ఆరువందల కిలోల నకిలీ పన్నీర్ పట్టుబడింది. తీగలాగితే డొంక కదిలినట్టుగా దీని ఆధారంగా మరికొన్నిచోట్ల తనిఖీలు చేయగా మరో మూడువేల కిలోల పన్నీర్ దొరికింది. ఈ పన్నీర్‌ను హోటళ్లు, క్యాటరింగ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. తయారీలో రసాయనాలు, నాణ్యతలేని పదార్థాలు ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు. నిన్న జియాగూడలో డెబ్బయి రెండు డ్రమ్ముల కల్తీ పచ్చడి పట్టుకున్నారు. అంతకుముందు కూడా పలుచోట్ల చేసిన సోదాల్లో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్, కల్తీ మిర్చి పొడి, పసుపు, గడువు ముగిసిన ఆహారపదార్థాలు పట్టుబడ్డాయి.

ఈ వరుస ఘటనలతో నగరంలో ఆహారభద్రతపై ఆందోళన మొదలైంది. ఈ యాంత్రిక జీవనంలో చాలామంది హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దీన్నే ఆసరగా చేసుకున్న అక్రమార్కులు కల్తీదందాకు యథేచ్ఛగా తెరలేపుతున్నారు. పండగ సీజన్‌లలో ఇది మరీ ఎక్కువగా ఉంటోంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఏం చేస్తోందన్నదే ఇక్కడ ప్రశ్న. ఎవరో సమాచారమిస్తే తప్ప నేరుగా పట్టుకోలేని నిద్రావస్థలో అధికార యంత్రాంగం ఉండటం శోచనీయం!

ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న కల్తీ ఆహార దందాలను ప్రజల ఆరోగ్యంపై పెరుగుతున్న దాడిగానే భావించాలి. రోజువారిగా వినియోగించే ఆహారపదార్థాల్లోనే నకిలీ, కల్తీ పదార్థాలు కలిపి విక్రయించడం సామాన్య ప్రజల జీవన భద్రతకు సవాల్‌గా మారింది. పాలు, నెయ్యి, నూనెలు, మసాలాల వంటి ఎక్కువ అవసరమైన వస్తువులే కల్తీకి గురవుతున్న పరిస్థితి నెలకొంది. భారీ స్థాయిలో నకిలీ ఆహార పదార్థాలను నిల్వచేసి ఉంచడంలో కేవలం వ్యాపారుల దురాశే కాకుండా, ఇందులో ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే క్రూరత్వం కూడా కనిపిస్తోంది.

తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలనుకునే ఆశతో కొంతమంది నాణ్యతను పూర్తిగా పక్కనపెట్టి ప్రమాదకరమైన రసాయనాలను ఉపయోగించడం అత్యంత ప్రమాదకరం. రసాయనాలు కలిపిన పచ్చళ్లు, నిల్వ కోసం వాడే హానికర పదార్థాలు, కృత్రిమ రంగులు ఇవన్నీ శరీరంపై నెమ్మదిగా విషంలా పని చేస్తాయి. జీర్ణసమస్యలు, కాలేయ వ్యాధులు, క్యాన్సర్ వరకు దారితీసే ప్రమాదం ఉంది. పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం కలిగిస్తాయి. ఫుడ్ పాయిజన్ కేసులు పెరగడానికి కూడా ఆహార పదార్థాలలో నాణ్యత లేకపోవడమే ప్రధాన కారణం.

ఇంకా పలుచోట్ల చేసిన తనిఖీల్లో మూడు వేల కిలోల కల్తీ నెయ్యి పట్టుబడింది. పదకొండు వందల కిలోలకు పైగా కల్తీ జింజర్‌గార్లిక్ పేస్ట్ స్వాధీనమైంది. వీటిలో సిట్రిక్ యాసిడ్, ఇతర రసాయనాలు కలిపి తయారు చేసి హోటళ్లకు సరఫరా చేస్తున్నట్టు వెల్లడైంది. జియాగూడలో నకిలీ పచ్చళ్ల కేంద్రంపై చేసిన దాడిలో పాడైన కూరగాయలు, అతి తక్కువ నాణ్యత గల పదార్థాలతో తయారు చేస్తున్నట్టు నిర్ధారణ అయింది. బోరబండ, సికింద్రాబాద్‌లో పెద్దస్థాయిలో అనధికార యూనిట్లు, గోదాములు బయట పడటం చూస్తే ఇదంతా వ్యవస్థీకృత మాఫియాలా కనిపిస్తోంది. ఇది కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే కాదు, సమాజానికే ముప్పుగా మారుతోంది. కల్తీ ఆహారం కేవలం నాణ్యత సమస్యే కాదు, అది నేరపూరితం. ఇది ప్రభుత్వ పర్యవేక్షణ లోపమే తప్ప వేరేకాదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే అధికార యంత్రాంగం హడావిడి చేస్తుంది తప్ప, దీనికి శాశ్వత పరిష్కారం చూపడటం లేదు. దాడులు జరిగినప్పుడు తప్ప, ఆ తర్వాత యథావిధిగా సాగడం పరిపాటిగా మారింది. బీఎన్ఎస్, ఫుడ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం కల్తీ ఆహారం లేదా డ్రింక్స్ అమ్మితే కనీసం ఆరునెలల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించాలి. తీవ్రమైన అనారోగ్యానికి గురైనా, ప్రాణపాయం ఏరపడినా జైలు, లేదా జీవితఖైదు విధించే అవకాశం ఉంది.ఈ లెక్కన ఎంత మందిని శిక్షించారు? ఎన్ని కేసులు నమోదు చేశారు? వేళ్లపై లెక్కకట్టేలా కూడా ఉండవంటే అతిశయోక్తికాదేమో!

ఇలా చూస్తే పచ్చళ్లు, పేస్ట్‌లు వంటి రోజువారి ఆహార పదర్థాలన్నీ కల్తీకి గురవుతున్నాయి. అంటే, మన ప్లేట్‌లో పడే ప్రతిపదార్థం కూడా ఇప్పుడు అనుమానాస్పదంగా మారుతోంది. ఇందులో వినియోగదారుల పాత్రను కూడా తీసిపారేయలేం. తక్కువ ధరల ఆశతో నాణ్యత లేని ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఈ నకిలీ దందాను మనమే ప్రోత్సహిస్తున్నట్టు అవుతోంది. సరైన ప్రమాణాలు ఉన్న ఉత్పత్తులను ఎంపిక చేయడం, ప్యాకింగ్ తయారీ తేదీ, ఎఫ్ఎస్ఎస్ఎఐ గుర్తించడం, తయారీ లేబుళ్లను గమనించడం అత్యంత అవసరం. కల్తీ ఆహార దందాను అరికట్టాలంటే కేవలం దాడులు సరిపోవు. కఠినమైన శిక్షలు వేగవంతమైన న్యాయ ప్రక్రియ, ప్రజల్లో అవగాహన ఈ మూడు కలిసొస్తేనే ఫలితం ఉంటుంది. లేదంటే ‘కల్తీ ఆహారం’ అనే ముప్పు మన సమాజాన్ని నిశ్శబ్దంగా కబళిస్తూనే ఉంటుంది.



-దామరపల్లి నర్సింహారెడ్డి
9581358696



## సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారం

ప్రపంచ జల దినోత్సవంను ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం మేరకు 1993 నుండి ప్రతి సంవత్సరం మార్చి 22 న జరుపుకుంటున్నారు. యుఎన్‌వాటర్ ప్రపంచ జల దినోత్సవానికి కన్వీనర్ ప్రతి సంవత్సరం, ఆ రోజునాటి థీమ్ గురించి, దానిపట్ల ఆసక్తి ఉన్న ఐరాస సంస్థలతో సంప్రదిస్తుంది. 'నీరు మరియు లింగం' అనే ఇతివృత్తం.ప్రపంచ నీటి దినోత్సవం 2026, నీరు, మహిళలు మరియు లింగ సమానత్వం మధ్య ఉన్న కీలక సంబంధాన్ని చెబుతుంది. ఈ దినోత్సవమును మొదట లాంఛనప్రాయం గా రియోడి జనీరో, బ్రెజిల్ లో పర్యావరణం మరియు అభివృద్ధి పై 1992 ఐక్యరాజ్య సమితి సమావేశం యొక్క ఎజెండా 21 లో ప్రతిపాదించబడింది. మనం నివసించే భూగోళంలో 70 శాతానికి పైగా నీరే. అయితే, ఇందులో శుభ్రమైన నీరు చాలా స్వల్ప భాగం మాత్రమే. మొత్తం భూగోళంలోని నీటిలో దాదాపు 2.7 శాతం మాత్రమే శుభ్రమైన నీరు కాగా, ఇందులోనూ 75.2 % ధృవప్రాంతాలలో మంచురూపంలో ఘనీభవించి వుంటే, మరో 22.6 % నీరు భూగర్భంలో వుంది. మిగతా నీరు సరస్సులు, నదులు, వాతావరణం, గాలిలోని తేమ, భూమిలోని చెమ్మ,చెట్టు,చేమలలో ఉంటుంది. ఈ విశ్వంలో సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారం. నీరు ఎక్కడ ఉంటే అక్కడ ఆహ్లాదం వెల్లివిరుస్తుంది. పల్లెకైనా, నగరానికైనా నీటి వనరులు ఎంతో అవసరం. అభివృద్ధి విస్తరణకు కూడా నీరే ప్రధానం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి అవసరం పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా జనాభా అనూహ్యంగా అధికమవుతోంది. రానున్న కాలంలో నీటి డిమాండ్ భారీగా ఉండే సూచనలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జల వనరులను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. మార్చి 22 ‘ప్రపంచ జల దినోత్సవం’ సందర్భంగా నీటి సంరక్షణ కోసం ప్రతిన పూనాల్సిన తరుణమిదే..

పిన్నింటి బాలాజీ రావు
హనుమకొండ.
9866776286

## ఘనంగా ఈదుల్ ఫీతర్



**ఆమనగల్లు, మహా :** ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్, ఆయా గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం శనివారం రంజాన్‌ను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. రంజాన్ సందర్భంగా ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్ధలకు వేలాది మంది ముస్లింలు తరలివచ్చారు. చిన్నా పెద్దా అన్న తారతమ్యం లేకుండా కుటుంబ సభ్యులంతా కొత్త బట్టలు ధరించి, భక్తివంతో ప్రార్థనలకు వచ్చారు. మత గురువు అబ్దుల్ వాహేద్ ఖురాన్ సూక్తులను వినిపించి, ప్రార్థనలు చేయించారు. ముస్లింల జీవితంలో రంజాన్‌కు ఎంతో ప్రాధాన్యత కలదని, ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ రంజాన్ మాసంలో ఆవిర్భవించిందన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించాలన్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, రాష్ట్ర ఎఫ్ఎస్సి చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## సమాజంలో భక్తి, దాతృత్వానికి రంజాన్ స్ఫూర్తి : సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**ఆమనగల్లు, మహా :** శాంతి సమానత్వాలకు రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని టాస్క్ సిఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం విద్యానగర్ కాలనీలో కాలనీ అధ్యక్షులు,లయన్స్ క్లబ్ పిఆర్ఓ యంఎ పాషా నివాసంలో జరిగిన రంజాన్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పాషా కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం పారిశుధ్య కార్మికులకు,వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. సమాజంలో భక్తి, దాతృత్వానికి రంజాన్ స్ఫూర్తినిస్తుందని,అందరూ కలిసికట్టుగా పండుగను జరుపుకోవడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రవుఫ్, అలీమ్, ఆదిల్, రఫీ,కలీమ్, రబ్బానీ, అజీమ్, నాజర్, హాఫిజ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పలువురు కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళ సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ



**ఆమనగల్లు, మహా :** తలకొండపల్లి మండలంలోని వెంకట్ రావు పేట్ గ్రామంలో స్వయం సహాయక సంఘాల భవన నిర్మాణానికి శనివారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఇమ్మడి మహేష్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి, వారు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో నాణ్యతా ప్రమాణాలతో ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలే ప్రశాంత్,మాజీ సర్పంచ్ కెంచ హైమవతి రమేష్ ,బుక్ కీపర్ గాజుల అరుణ ,ఫీల్డ్ అసిస్టెంట్ కంభంపాటి సత్యం , వార్డు సభ్యులు గువ్వ శంకరయ్య, చప్పిడి హుస్సేన్, తోట శ్రీనివాసులు, గౌర్ల లింగం, మోక్తల సంతోష రాజు,కానుగుల భాగ్యమ్మ, బోల్గాం యాదమ్మ, గుమ్మల సువర్ణ,కానుగుల సంతోష,చప్పిడి కృష్ణమ్మ,అవాంఛ పద్మమ్మ,గుమ్మల సుమతమ్మ, బోసు జంగమ్మ,గువ్వ సుజాత,మొక్తల మాధవి,దప్పు ఇంజమూరి జంగమ్మ ,గువ్వ భారతమ్మ ,మరియు గ్రామ పెద్దలు గొరిగే పెద్ద వెంకటయ్య ,బంగారుగడ్డ వెంకయ్య , యాదయ్య కల్వకోలు లక్ష్మయ్యా యువకులు పిప్పల శివశంకర్, కానుగుల విజయ్ కుమార్,వవుల్దాస్ వెంకటేష్ ,ఇమ్మడి ఆనంద్ ,గొరిగే శివ,తోట క్రాంతి ,మొక్తల లింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు



**మొయినాబాద్ మహా :** మొయినాబాద్ మండలంలోని శనివారం రంజాన్ పర్వ దిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గత 30 రోజులుగా పవిత్ర మైన ఉపవాస దీక్షను పాటించి శనివారం మసీదులు, ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహిం చారు. ఆయా మసీదులో మత పెద్దలు రంజాన్ సందేశాన్ని వినిపించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆత్మీయంగా అలిగానం చేసుకుని పరస్పరం రంజా న్ పండుగ శు భాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మజీద్ కమిటీలు, పలు పార్టీల నాయకులు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## అనాధాశ్రమంలో అన్నదానం



**మొయినాబాద్ మహా :** మొయినాబాద్ మండల పరిధిలోని బాకారం జాగీర్ గ్రామంలోని శాంతి నిలయం అనాథ ఆశ్రమంలో నేడు ఆదివారం తన తల్లి సంవత్సర దినం జ్ఞాపకార్థంగా కుమారులు రావులకోలు విశ్వనాథ్, వినోద్,నవనీత, కవితలు కలిసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శేరిలింగంపల్లి పరిధిలోని ఖాజాగూడకు చెందిన కీర్తిశేషులు రావులకోలు యాదమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారులు, కుమార్తెలు వారి కుటుంబ సభ్యులు శాంతి నిలయం అనాథాశ్రమంలో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబీకులు మాట్లాడుతూ.. అనాథాశ్రమంలో నిర్వాహకులు ఇటువంటి సేవ చేస్తున్న వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాకుండా ఇలాంటి కార్యక్రమాలకి ముందుకు వచ్చి ఎవరైనా ఆశ్రమంలోని దివ్యాంగులకు వృద్ధులకు ఒంటరి మహిళలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తే బాగుంటుందన్నారు. అన్నదాన కార్యక్రమం చేసిన ఖాజాగూడాకు చెందిన కీర్తిశేషులు రావులకోలు యాదమ్మ కుటుంబీకులకు దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆశ్రమం తరఫున అందరు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతే శక్తి - స్నేహమే బలం

- సామాజిక ఐక్యతకు ప్రతీకగా రంజాన్
- ప్రజల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలకు తావులేదు
- అభివృద్ధి ఐక్యతే లక్ష్యంగా ముందుకు
- కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** రంజాన్ వేడుకలలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిషేక్ రెడ్డి, ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు అతి పవిత్రమైన రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని పలు దర్గాలను సందర్శించిన, కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ యువ నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, ముస్లిం సోదరులను కలిసి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అలాయి బలాయి తీసుకున్నారు.. ఈ సందర్భంగా అభిషేక రెడ్డి మాట్లాడుతూ... రంజాన్ పండుగ సౌహార్ద్రం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలను సమానంగా గౌరవించడం, వారి పండుగల్లో భాగస్వామ్యం కావడం తన కుటుంబం ఎప్పటి నుంచో అనుసరిస్తున్న సంప్రదాయమని అభిషేక్ రెడ్డి తెలిపారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలకు తావు లేకుండా, అభివృద్ధి మరియు ఐక్యతే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా, సమగ్ర అభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ముస్లిం సోదరులు, యువ నాయకుడి చర్యను అభినందిస్తూ, ఆయన నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నీల భాను గౌడ్, రాందాస్ నాయక్, మాజీ జెడ్పిటిసి భూపతి గల్లా మహిపాల్, కొత్తకుర్మ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఫిరోజ్, సొప్పరి టోనీ, ముత్యాల సంతోష్, మొహమ్మద్ అజాం, భరత్ రెడ్డి, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డును తలపిస్తున్న గండిపేట చెరువు

- పట్టించుకునే అధికారులే కరువు అంటూ స్థానికుల ఆరోపణ
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన హిమాయత్ నగర్ చెరువు కట్టా



**మొయినాబాద్ మహా :** మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్ నగర్ లోని గండిపేట చెరువు హైదరాబాద్ వాసులకు దాహార్తిని తీర్చుతున్న జంట జలాశయాల్లో ఒకటైన గండిపేట చెరువులో ఎక్కడికక్కడ చెత్త వేస్తూ డంపింగ్ యార్డుగా మారుస్తున్నారు. దీంతో చెరువు నీరు కలుషితమవుతోంది. అంతే కాకుండా గండిపేట చెరువు చుట్టుపక్కల ఉన్న హోటల్స్ ఫాంహౌస్ సైతం డ్రైనేజ్ వాటర్ ను చెరువులోకి వదలడంతో గండిపేట నీరు మురుగు నీటిగా మారుతున్నాయి అని స్థానికులు ఆరోపిస్తున్నారు హిమాయత్ నగర్ గండిపేట చెరువు వద్ద చెత్త వేస్తున్న అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సైతం ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు .రోజు గస్తీ నిర్వహించే జలమండలి అధికారులు సైతం చూసి చూడనట్టు పట్టించుకోవడం లేదంటూ. ఇకనుండి చెరువులో చెత్త వేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలి. గండిపేట చెరువులో కబ్జాకు గురైన ఎఫ్టీఎల్ భూములు సైతం కాపాడే బాధ్యత జలమండలి అధికారులు తీసుకోవాలి పేరుకే హైడ్రా ఎఫ్టీఎల్ లో మాత్రం లోకల్ లీడర్ల అండదండలతో బడా బాబులు కబ్జాలో ఉన్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతున్న హిమాయత్ నగర్ చెరువు కట్ట**

హిమాయత్ నగర్ చెరువు కట్టపై అర్థరాత్రి సమయంలో ఇష్టనూరాజ్యం గా మద్యం సేవిస్తూ చెడు వ్యసనాలకు అలవాటు పడి జల్సాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు ప్రధానంగా మున్సిపాలిటీ లోని కాలేజీ విద్యార్థులు మద్యం సేవిస్తూ హద్దు అదుపు లేకుండా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారడంతో ఇప్పటికైనా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకముందే అధికారులు ఇకనైన భద్రత పెంచి చర్యలు తీసుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు

## కొండిగారి సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండ గారి రాములు సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఆయన మార్గంలో నడవడం ప్రతి కార్యకర్త కర్తవ్యమని పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలో సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల పరమపదించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కొండి గారి రాములు మృతి పట్ల సంఘీభావం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సంతాప సభ నిర్వహణపై ఈ సమావేశంలో చర్చించారు. రాములు ప్రజా సేవలో చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా సంతాప సభను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ. కొండ గారి రాములు మృతి జిల్లా ప్రజలకు తీరని లోటని, ఆయన ఆయన సమాజానికి చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఆయన మార్గంలో నడవడం ప్రతి కార్యకర్త కర్తవ్యమని తెలిపారు. సంతాప సభను విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర నాయకులు కావలి నరసింహ ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ... సంతాప సభను ఈ నెల 31వ తేదీన జరిపి విజయవంతం చేసే విధంగా ప్రతి కార్యకర్త ఉత్సాహంగా పనిచేయవలసిన అవసరం ఉందని వారు తెలిపారు.

సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పోచమోని నీలమ్మ, పి శివ కుమార్, యంజాల్ కార్యదర్శి కాటం రాజు, ఇబ్రహీంపట్నం మంచాల నాయకులు ములుగు నర్సింహా, అనంతరెడ్డి, రాజు, బండి నర్సింహా, జంగిలి నర్సింహా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని, కార్యక్రమ ఏర్పాట్లపై తమ సూచనలు వెల్లడించారు.

## త్యాగానికి ప్రతీక రంజాన్ పండుగ



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** రంజాన్ పండుగ సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని ఈద్గాలను, మహేశ్వరం డిసిపి కే సత్యనారాయణ రెడ్డి సందర్శించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో నెల రోజులు ఉపవాస దీక్షలు చేసి నెలవంకను చూసి రంజాన్ పండుగను జరుపుకోవడం ఆనాదిగా వస్తున్న సాంప్రదాయం. ఈ సందర్భంగా మహేశ్వరం డిసిపి కె సత్యనారాయణ రెడ్డి, ఏసీబీ కేపీవి రాజుతో కలిసి ఇబ్రహీంపట్నంలోని ఇబ్రహీంభాష ఈద్గాను సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించి ఆయన, ఏర్పాట్లపై సంబంధిత పోలీసు అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... రంజాన్ పండుగ త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. ముస్లిం సోదరులు, ప్రజలందరూ శాంతి, సామరస్య వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని బిజెపి అన్నారు. అలాగే రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి, హైదరాబాద్ ఫార్మా సిఐ సత్యనారాయణ, ఎస్సై సూర్య తేజ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జవహర్ నగర్ లో ప్రశాంతంగా ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు



**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్ లో ప్రశాంతంగా శనివారం ఈద్–ఉల్–ఫితర్ వేడుకలు జరిగాయి. జవహర్ నగర్ వికలాంగుల కాలనీలో గల నయ ఈద్గాలో సయ్యద్ ముబారక్ ఎండి మొహినిద్దీన్ ఆధ్వర్యంలో, వెంకటేశ్వర కాలనీలో కె ఎస్ అహ్మద్, అంబేద్కర్ నగర్ ఈద్గాలో ఎండి ఉమర్ షరీఫ్, మల్కారం ఈద్గాలో మొహమ్మద్ షాబుద్దీన్, ఫరానగర్ ఈద్గాలో ఎండి కరీంఖాన్, అరుంధతి నగర్ ఈద్గాలో సుల్తాన్, వైయస్సార్ నగర్ డంపింగ్ యార్డ్ పరిధిలో ఎండి జావేద్, ఆధ్వర్యంలో రంజాన్ ప్రార్థనలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మహమ్మద్ పాషా మియా, టి. కలేశా, జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల జ్యోతి శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు మాట్ల వినయ్ కుమార్, సాయికుమార్, జవహర్ నగర్ లోని అన్ని వర్గాల ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పటిష్టమైన భద్రతను కల్పించిన జవహర్ నగర్ సిఐ సైదులు, ఎస్సై రామునాయక్ లు ప్రార్థనలు సజావుగా జరగడానికి సహకరించినందుకు పోలీస్ అధికారులకు పోలీసులకు ప్రభుత్వ పెద్దలకు జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

## బడ్జెట్‌లో ఉద్యమకారుల ను విస్మరించడం తగదు

**తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మల ప్రపోల్ రాంరెడ్డి**



**కుషాయిగూడ, మహా :** రాష్ట్ర బడ్జెట్‌లో తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించడం వారి మనోభావాలను దెబ్బతీసే చర్య అని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక కన్వీనర్ తుమ్మల ప్రపోల్ రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కుషాయిగూడలో మీడియాతో మాట్లాడిన ఆయన తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు ఉద్యమకారులు అక్రమ అరెస్టులు, లాఠీచార్జీలు, బెదిరింపులు, అనేక కష్టాలను ఎదుర్కొంటూ పోరాడారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఇప్పుడు విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమం లేకపోతే రాష్ట్రం సాధ్యమయ్యేది కాదని, రాష్ట్రం వచ్చిన తర్వాత కొంతమందికే లాభాలు చేకూరగా, ఉద్యమకారుల పరిస్థితి మాత్రం దయనీయంగా మారిందన్నారు. వందలాది మంది ఉద్యమకారులు కేసుల పాలై ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, వారి ఆర్థిక పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఉద్యమకారులకు కనీస ప్రాధాన్యం ఇవ్వకపోవడం వారిని పూర్తిగా విస్మరించినట్టేనని విమర్శించారు. వెంటనే ఉద్యమకారుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, వారి పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రులు మాటలకే పరిమితమై ప్రలోభాలు చూపుతున్నారని, కానీ ముఖ్యమంత్రి స్థాయిలో ఇప్పటికీ ఉద్యమకారుల సమస్యలపై చర్చ లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పటికైనా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి ఉద్యమకారులకు న్యాయం చేయాలని తుమ్మల ప్రపోల్ రాంరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

## రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు

**- పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**కుషాయిగూడ, మహా :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కాప్రా మసీదు లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రంజాన్ పండుగ మనిషుల మధ్య ప్రేమ, దయ, పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్ర సమయమని, సమాజంలో ఐక్యతను బలపరిచే సందర్భమని, ఈ పండుగ అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, మైనార్టీ నాయకులు బద్రుద్దీన్, పార్టీ నాయకులు మహేష్, శివకుమార్, రహీం ముస్లిం పెద్దలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి కళ్యాణానికి హాజరైన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



**కుషాయిగూడ, మహా :** మీర్ పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ పరిధిలో తిరుమలనగర్ పోచమ్మ ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ అభిషేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ముఖ్య అతిథులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్ సదానందం గుప్తా, సీ హెచ్ రాజు మరియు ఆలయ కమిటీ సభ్యులు సముద్రాల కృష్ణమూర్తి, బ్రహ్మాచారి, తిమ్మారెడ్డి, రాజు, సురేష్ గౌడ్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి



**ఆమనగల్లు, మహా :** మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే పండుగ రంజాన్ అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. శనివారం రంజాన్ పండుగను సందర్భంగా ఆమనగల్లు ఈద్గా వద్ద ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.ప్రత్యేక ప్రార్థనల అనంతరం, ఎమ్మెల్యే ఈద్గా వద్దకు చేరుకొని, మైనార్టీ సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకకగా నిలిచే పండుగలో ఒకటైన రంజాన్ ఆనందదాయకంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు వగ్గు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## శేరిగూడలో కారు బీభత్సం..?



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా :** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని శేరిగూడలో శనివారం మధ్యాహ్నం ఓ కారు బీభత్సం సృష్టించింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ గ్రామంలో హోండా అమేజ్ కారు డ్రైవర్ ఫోన్ చూస్తూ నిర్లక్ష్యంగా నడవడంతో, ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద చెట్టు కింద కూర్చున్న మహిళల పైకి దూసుకెళ్లింది. అలివేలు, పోచమ్మకు తీవ్ర గాయాలు కాగా.. లక్ష్మమ్మ, పెంటమ్మకు స్వల్ప గాయాలయ్యాయని ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి వెల్లడించారు. గాయపడినవారిని వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతానికి వారి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. శేరిగూడలో జరిగిన ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సిఐ వెల్లడించారు.

# కాంగ్రెస్ 6 గ్యారంటీలు అమలయ్యేలా చూడండి

- కలెక్టర్‌కు బీజేపీ వినతి



**కుషాయిగూడ, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతృత్వంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నరపరాజు రామచంద్రరావు ఆదేశాల మేరకు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్నిఅందజేశారు. ముఖ్య అతిథిగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీ నర్సయ, కామారెడ్డి జిల్లా ఇన్చార్జ్ పట్లోళ్ల విక్రమ్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆరోగ్య గ్యారంటీలను ప్రాధాన్యతగా తీసుకొని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులు మరియు సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బౌరంపేట మల్లారెడ్డి, మర్రి మోహన్ రెడ్డి, ఏఎస్ రావు నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షురాలు సంధ్యా రెడ్డి, మహిపాల్ రెడ్డి, వెంకన్న, జవహర్ నగర్ బీజేపీ ప్రధాన కార్యదర్శి యాదగిరి, మల్లికార్జున్ గౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

### 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ సానిటేషన్ పరిశీలన



**కుషాయిగూడ, మహా :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ప్రసాద్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యాచరణలో భాగంగా కాప్రా సర్కిల్ ప్రాంతాల్లో మసీదులు, దర్గాలు వద్ద సానిటేషన్ ఏర్పాట్లను పరిశీలించారు. పరిశీలనలో, గ్రీన్ వేస్ట్ నిర్వహణలో సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. రామ్కీ ట్రాన్స్ పోర్ట్ స్టేషన్‌లో ఇంటింటి నుండి సేకరించబడిన చెత్తను సక్రమంగా తరలించేందుకు కావలసిన కంటైనర్ల సంఖ్య పెంచాలని, అలాగే కుషాయిగూడ వాసవి, శివనగర్ ప్రాంతంలో ప్రైవేట్ స్థలంలో డంప్ చేసిన గ్రీన్ వేస్ట్‌ను వెంటనే తొలగించవలసిందని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, సానిటేషన్ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్ రామకృష్ణ, శ్రీనివాస్ ఎస్, సుజాత, వసంత, రామ్కీ ఉప్పల్ జోనల్ ఇంచార్జ్ కృష్ణ, కాప్రా సర్కిల్ ఇంచార్జ్ నవీన్ కుమార్ రెడ్డి, సూపర్ వైజర్ శృతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు.. భక్తిశ్రద్ధలతో ముస్లింలు ప్రార్థనలు




**మహా, సదాశివపేట:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ, మండలంలో ముస్లిం సోదరులు శనివారం రంజాన్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తి,శ్రద్ధలతో ఈద్గా ల వద్ద ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆప్యాయంగా రంజాన్ పండుగ (ఈద్ ముబారక్ ) తెలుపుకున్నారు. సమాజంలో శాంతి,సౌభ్రాతృత్వం,ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈద్ ఉల్ ఫితర్ పండుగను భక్తి శ్రద్ధలతో సోదర భావంతో ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ నెల ముగిసిన తర్వాత జరుపుకునే ఈ పండుగ ముస్లిం లకు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఒక నెల పాటు రంజాన్ ఉపవాసం చేసిన అనంతరం,నెలవంక దర్శనంతో షావ్వల్ మాసం ప్రారంభం అవుతుంది. ఆ నెల మొదటి రోజున ఈద్ పండుగను జరుపుకుంటారు. ఈ రోజు అల్లాకు కృతజ్ఞతలు తెలిపే రోజుగా కూడా భావిస్తారు. సదాశివపేట ఈద్గా వద్ద జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎమ్మెల్యే తనయుడు చింత సాయినాథ్, టిఆర్ఎస్ నాయకులు నాగుల విజయకుమార్ ,దిడిగి నాగేష్, తదితర బీఆర్ఎస్ నాయకులు హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.



# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన బీర్ల అయిలయ్య

**మహా, సదాశివపేట :** రంజాన్ పర్వదినం సందర్భంగా నేడు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు... ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి,పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఎంఏ ఏజాజ్, జైనోద్దీన్ , బీజన భాస్కర్ సాగర్ రెడ్డి తదితరులు ఉన్నారు.









# ఆదిలాబాద్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు

### ముస్లీంలకు కంది శ్రీనివాస రెడ్డి శుభాకాంక్షలు
### ఈద్గా వద్ద కలిసిన కంది శ్రీనివాస రెడ్డి
### ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలిపిన అసెంబ్లీ ఇంచార్జి

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ ప్రజల సంస్కృతి భిన్నత్వంలో ఏకత్వం లా, గంగా జమునా సరస్వతీ నదుల సంగమం లాగా అన్ని పండగలు కలిసి మెలిసి జరుపుకుంటామని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా శనివారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి పట్టణంలోని ఈద్గా మైదానం వద్ద ప్రార్థనల అనంతరం ముస్లీం సోదరులను కలిసి శుభాకాం క్షలు తెలిపారు. ముస్లీం సోదరులను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని చేతిలో చేయి కలుపుతూ ఈద్ ముబారక్ తెలిపారు.








ఎన్నోఏళ్లుగా ఇక్కడి అన్ని మతాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉంటున్నారన్నారు. మతసామర్యాన్ని పాటిస్తూ అన్ని పండగలను కలిసి మెలిసి జరుపుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలోని ముస్లీం సోదరులకు సోదరీమణులకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అందరూ ఆయురారోగ్యాలతో సిరిసంపదలతో ఆనందమయంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్మ చైర్మన్ సంతోష్ రావు,కౌన్సిలర్లు సంజయ్, అన్నపూర్ణ, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, లోక ప్రవీణ్ రెడ్డి,బండారి సతీష్, సుధాకర్ గౌడ్, ఎల్టీ భోజారెడ్డి,బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న,తమ్మల చందు, మైనారిటీ నాయకులు పత్తిముజ్జు,ఎంఏ షకీల్,ఖయ్యూం తదితరులు హాజరయ్యారు.

# ముస్లీం నాయకుల నివాసాలను సందర్శించిన కంది శ్రీనివాస రెడ్డి

### శాలువాలతో సత్కరించి రంజాన్ శుభాకాంక్షలు





**ఆదిలాబాద్, మహా :** నెల రోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం ముస్లీం లు ఆనందోత్సహాల మధ్య జరుపుకునే రంజాన్ పండగ సందర్భంగా ఆదిలా బాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పలువురు ముస్లీం సోదరుల నివాసాలను సందర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్ , డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ , ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ నసీర్ అహ్మద్ నివాసాలతో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకుల నివా సాలను సందర్శించి వారిని శాలు వాల తో సత్కరించి కుటుంబ సభ్యులందరికి పండగ శుభాకాంక్షలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండా రి అనూష సతీష్, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కౌన్సిలర్ ఇజ్జగిరి సంజయ్, నాయకులు కొండా గంగాధర్, లోక ప్రవీణ్ రెడ్డి, బూర్ల శంకరయ్య, తమ్మల చందు, ఖయ్యుమ్, అరవింద్, శంకర్, దాసరి ఆశన్న పాల్గొన్నారు.

# ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలి

### రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాలలో మంత్రి ప్రత్యేక పూజలు



**మందమర్రి, మహా :** ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం మందమర్రి, క్యాతనపల్లి ఈద్గాలలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు నిష్ట నియమాలతో ఉపవాసాలు ఉంటారని చెప్పారు. ప్రేమ అనురాగాలు, మానవత్వంతో ప్రజలందరూ ఉన్నప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. మందమర్రి సి ఈ ఆర్ క్లబ్ వెనకాల ఉన్న ఈద్గాకు 50 లక్షలతో షాదిఖానా, ఈద్గా వద్ద కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసేందుకు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. అలాగే సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి ఈద్గా వద్ద కమాన్ ఏర్పాటుకు కృషి చేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి వైస్ ఎంపీపీ వజీర్ సుల్తాన్, ఎండి అజీజ్, సొత్కు సుదర్శన్, మంద తిరుమల్, జావిద్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నేతలు నోముల ఉపేందర్ గౌడ్, ఆకారం రమేష్, పైడి మల్ల నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి వెంటనే 50వేల కోట్ల అప్పు చెల్లించాలి




**బెల్లంపల్లి, మహా :** సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 50 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటియుసి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శనివారం రోజున బెల్లంపల్లి లోని శాంతిఖని మైన్ మీద ఏ ఐ టి యూసి ఆధ్వర్యంలో దాసరి తిరుపతి గౌడ్ అధ్యక్షతన సేవ్ సింగరేణి కార్యక్రమం లో భాగంగా శాంతి గని మైన్ మీద గేట్ మీటింగ్ నిర్వహిం చడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కామ్రేడ్ డిప్యూటి జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య , సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మిట్టప ల్లి వెంకటస్వామి,బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్,పాల్గొని సుదీర్ఘమైన ప్రసంగం చేయడం జరిగింది,ఇందులో భాగంగా ఈ మీటింగ్ ను ఉద్దేశించి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కీ సమ్మయ్య , సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి , మరియు బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్ లు సంయుక్తంగా మాట్లాడుతూ పలుడిమాండ్ల మీద సుదీర్ఘంగా ప్రసంగించడం జరిగింది. సింగరేణి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 50వేల కోట్ల రూపాయల ను వెంటనే సింగరేణి కి ఇవ్వాలని,మెడికల్ బోర్డు ను పాత పద్ధతిలోనే త్వరితగతిన కొనసాగించాలిని,కార్పొరేట్ స్థాయి స్ట్రక్చర్ మీటింగులో గుర్తింపు సంఘంతో ఒప్పందం కుదుర్చుకున్న అంశాలను వెంటనే అమలు చేయాలనీ,పార్క్స్ పై ఇన్కమ్ టాక్స్ ను కోల్ ఇండియా లో మాదిరి గా సింగరేణి యాజమాన్యం చెల్లించాలని,నూతన బొగ్గు బ్లాకులను చేపట్టి ఉద్యోగ భద్రత కల్పించి సింగరేణి కాపాడాలని ,ఎన్ 1 సర్కులర్ను రద్దు చేసి పాత విధానంలోనే పునరుదరించాలని,సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ను హైదరాబాద్ లో ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని,150/200 మాస్టర్ల నిబంధన పై క్రమశిక్షణ చేయను అని రద్దు చేయాలని,కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలనీ,మున్సిపల్ పరిధిలోని కళ్యాణికి ఉపరితలదని (మందమర్రి) క్వార్టర్లు లేని కార్మికులకు ఇంటి కిరాయి చెల్లించాలనే పలు డిమాండ్ల మీద ధర్నా నిర్వహించి కార్మికుల నినాదాలతో గని మేనేజర్ కి మెమొరాండం ఇవ్వడం జరిగింది. ఈ మీటింగలో కాశీపేట-1 పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ ,కాశీపేట -2 పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, సిపిఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి అదుపు రాజమౌళి, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు రత్నం రాజం అలాగే శాంతిఖని మైన్ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ మంతెన రమేష్ , దాడి రమేష్, బబ్బెర రామకృష్ణ, దుర్గం రాజేష్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు మిట్టపల్లి రమేష్, దమ్మేట శ్రావణ్, తుంగపిండి రవి, మంతెన భాస్కర్, రాజ్ కుమార్, మహంకాళి సంతోష్, రత్నం ప్రవీణ్, రామ్టెంకీ వెంకయ్య, ఉడ్నాల శ్రీకాంత్, ఎల్లబోయిన గణేష్, బియ్యాల వెంకటేష్, జనార్ధన్,కొత్తప ల్లి రాజేష్, బొంకురి రామచందర్, పులి పాక స్వామి దాస్, అలాగే మైన్స్ కమిటీ సభ్యులు, సేఫ్టీ కమిటీ సభ్యులు, క్యాంటీన్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మంచాల పోతన్న మృతి

### పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి
### కుటుంబ సభ్యులకు పరామర్శ



**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ రూరల్ మండలం అనుకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంచాల పోతన్న శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్నఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆయన నివాసాన్ని సందర్శించి భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు.. అనంతరం పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కౌన్సిలర్ ఇజ్జగిరి సంజయ్,నాయకులు కొండా గంగాధర్, లోక ప్రవీణ్ రెడ్డి, బండారి సతీష్, బూర్ల శంకరయ్య, తమ్మల చందు, ఖయ్యుమ్, అరవింద్, శంకర్, దాసరి ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఘనంగా రంజాన్

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు శనివారం ఈద్-ఉల్-ఫితర్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజులుగా కఠిన ప్రార్థనలు ఆచరించిన రంజాన్ మాసం క్రమశిక్షణ, నిష్ట, దాతృ త్వం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుంది. ఉపవాస దీక్షల ద్వారా మనస్సు పవిత్రతో పాటు సమాజంలో పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వం పెంపొందుతుంది. మత, వర్గ, వర్ణ, భేదాలను వదిలి పరస్పర ఐకమత్యంతో కలసి మెలసి వేడుక జరుపుకునేలా ఉపదేశిస్తుంది. రంజాన్ లాంటి పండుగలు సమాజంలో ఐక్యతను బలపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి, రంజాన్ సందేశం శాంతి, సహనం, సేవాభావం లాంటి గొప్ప విలువలను తెలియజేస్తుంది. రంజాన్ పండగ సందర్భంగా ఉదయమే పట్టణంలోని ఈద్గా మైదానానికి ముస్లింలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. నూతన వస్త్రాలు ధరించి సామూహిక నమాజ్ ఆచరించా రు. అనంతరం ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నమాజ్ పూర్తయిన తర్వాత ఒకరినొకరు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు రాజకీయ నేతలు ,ప్రముఖులు ముస్లిం సోదరు లకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజే సారు. అటు ముస్లీంల ప్రార్థనలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బలగాలు, నిఘా బృందాలతో పటిష్ట భద్రతను కల్పించారు.





# పత్తి చేనులో పసికందు



**ఆదిలాబాద్ మహా :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం వల్లగొండ గ్రామపంచాయతీ సీతానగర్ శివారులో పత్తి చేనులో పసికందును గుడ్డలో కట్టి పడేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, శిశువును సురక్షితంగా బయటకు తీసి వైద్య సంరక్షణకు తరలించారు. శిశువు ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బాధ్యుల కోసం గాలిస్తున్నారు.

## ప్రతి ఎకరానికీ సాగునీరు అందించడమే నా ధ్యేయం

**ద్విచక్ర వాహనంపై కాలువలను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి**

**బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుతో నల్గొండ సస్యశ్యామలం**



**నల్గొండ, మహా :** నల్గొండ నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన ధ్యేయమని రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శనివారం నల్గొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలో బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న సాగునీటి కాలువలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.? సాగునీటి కాలువల పరిస్థితిని స్వయంగా తెలుసుకునేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సామాన్యుడిలా ద్విచక్ర వాహనాన్ని నడిపి అందరినీ ఆశ్చర్యపరిచారు. అప్పాజీపేట శివారులో కాలువ వెంబడి బైక్‌పై ప్రయాణిస్తూ నీటి ప్రవాహాన్ని, కాలువల నిర్మాణాన్ని పరిశీలించారు. మార్గమధ్యలో పొలాల వద్ద ఉన్న రైతులను పలకరించి సాగునీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి తమ వద్దకు వచ్చి మాట్లాడటంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కొండపాకగూడెం నుంచి అప్పాజీపేట వరకు కొత్తగా ఏర్పాటు చేయనున్న పిల్ల కాలువ పనులకు మంత్రి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు కాలువల ద్వారా నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపుతాం. చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. నియోజకవర్గ రైతాంగం సాగునీటి కోసం ఇబ్బంది పడకూడదన్నదే నా సంకల్పం అని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పిల్ల కాలువ పనులను అత్యంత నాణ్యతతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# మహిళల స్వశక్తికి ఇందిరా మహిళా శక్తి తోడ్పాటు

**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**





**మంచిర్యాల, మహా :** మహిళల స్వశక్తికి ఇందిరా మహిళా శక్తి తోడ్పాటు నిస్తుందని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శనివారం చెన్నూర్ మండల కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కృషి చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా ఒక్కొక్క కుట్టు మిషన్ 12 వేల రూపాయల విలువతో 360 మంది మైనారిటీ మహిళలకు పంపిణీ చేస్తామని వెల్లడించారు. మహిళ లబ్ధిదారులకు కుట్టు శిక్షణ ఇప్పించి తదనంతరం పని కల్పిస్తామని వివరించారు. ప్రభుత్వం అందించిన కుట్టు మిషన్లను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక అభివృద్ధి దిశగా ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. ఇందిరా క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, ఇతర అనేక వ్యాపారాలలో మహిళలకు భాగస్వామ్యంకల్పించి అభివృద్ధి చెందే దిశగా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళను కుటుంబ పెద్దగా గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కూడా చేస్తున్నామని అన్నారు. అలాగే ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి వంటి కార్యక్రమాలను అమలు చేస్తూ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలకు అండగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. అంగరాజుపల్లిలో 6 లక్షల రూపాయల వ్యయంతో సి సి రహదారుల నిర్మాణం, కుమ్మరికుంటలో 1 కోటి 87 లక్షల రూపాయలతో పునరుజ్జీవ పనులకు శంకుస్థాపన చేశామని స్పష్టం చేశారు. అమృత్ పథకంలో భాగంగా మందమర్రి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయలు, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 40 కోట్ల రూపాయలు, చెన్నూర్ మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయలతో అమృత్ పథకం కింద పనులు చేపట్టి, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 60 కిలోమీటర్ల మేర పైప్ లైన్ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నీటి సమస్య పరిష్కారం దిశగా 45 కోట్ల రూపాయల ప్రాజెక్టు మంజూరు చేసి భవిష్యత్తులో 15 సంవత్సరాల వరకు నీటి సమస్య లేకుండా కృషి చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి చర్యలలో భాగంగా డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులను వినియోగించి పనులు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సహిస్తూ అవసరమైన తర్ఫీదు అందిస్తుందని తెలిపారు. కుట్టు మిషన్లు పొందిన లబ్ధిదారులకు మున్సిపల్ పరిధిలో తగు శిక్షణ అందించి పని కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేసవిలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అమృత్ పథకం ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ అందించి శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా చెన్నూర్ పట్టణంలోని గర్రె కాలనీ, మార్కెట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంతాలలో 3 నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఈ ట్యాంకుల ద్వారా ఇంటింటికి సుద్ధమైన త్రాగునీటిని అందించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. మండలంలోని చెరువులు, కుంటలు ఇతర నీటి వనరులను అభివృద్ధి చేసి శుద్ధం చేసిన నీటిని కొరత లేకుండా అందించే దిశగా కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. చెరువుల సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్, చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, చెరువులను శుభ్రం చేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించి నీటి లభ్యత గా కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు



## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

**నల్గొండ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు**

**ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి**

**నల్గొండ, మహా :** మత కలహాలకు తావులేకుండా సోదరభావంతో, ఐక్యతతో రంజాన్ పండుగను జరుపుకోవాలని రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డులో గల ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.?అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత 30 రోజుల పాటు ముస్లిం సోదరులు కఠోర దీక్షలు, ప్రార్థనలతో పవిత్ర రంజాన్ మాసాన్ని గడిపారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే ఈ పండుగ. అల్లా ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. నల్గొండ పట్టణంలో గత మూడు దశాబ్దాలుగా హిందూ ముస్లింలు ఎంతో సామరస్యంగా, శాంతియుతంగా పండుగలు జరుపుకోవడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ముస్లింల సంక్షేమం కోసం రూ.3,500 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. గతంలో వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో అమలు చేసిన 4 శాతం రిజర్వేషన్ల వల్ల ముస్లింలు విద్య, ఉద్యోగ రంగాల్లో గొప్పగా రాణిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, వై. అశోక్ రెడ్డి, ఏఎస్పీ రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. వీరితో పాటు తహసీల్దార్ పరశురాములు, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పాశం రామ్ రెడ్డి, కార్పొరేటర్లు మామిడి కార్తీక్, సుభాష్, నవీన్ తదితర అధికారులు, మైనార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఆర్.కే.ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**యశోద ఆసుపత్రి నిపుణులచే 600 మందికి వైద్య పరీక్షలు**



**నల్గొండ, మహా :** నిరుపేదల ఆరోగ్యానికి భరోసా కల్పించడమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు దోహద పడతాయని బీజేపీ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్, 10వ డివిజన్ కార్పొరేటర్ పిల్లి కృష్ణమరాజు, పిల్లి శివకృష్ణ రాజ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మలకపేట యశోద ఆసుపత్రి, ఆర్కేఎస్ (=ఖుా) ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ప్రేరణ పాఠశాలలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్థానిక 10వ డివిజన్ కార్పొరేటర్ చొరవతో నిర్వహించిన ఈ శిబిరానికి పట్టణంలోని వివిధ డివిజన్ల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. యశోద ఆసుపత్రికి చెందిన గుండె నిపుణులు డాక్టర్ వీరారెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ షైనీ, జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ గోపీనాథ్ రోగులకు పరీక్షలు నిర్వహించి సలహాలు అందించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు 600 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరంలో ప్రధానంగా 2డీ ఎకో (2ఐ జుఎష్ట్రశీ), ఈసీజీ, బీపీ, షుగర్, మధుమేహం, హిమోగ్లోబిన్ (ఎఎ) పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, స్త్రీలకు సంబంధించిన ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలను చేరువ చేయడమే తమ ఫౌండేషన్ ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేరణ స్కూల్ ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, బానోత్ రవి నాయక్, గంగర బోయిన వెంకన్న, ఐతరాజు జానయ్య, పుల్లెంల మహేష్, జ్యోతి, కృష్ణ, అశోక్ రెడ్డి, నామ ప్రకాష్, వెంకటాచారి పాల్గొన్నారు. అలాగే బీజేపీ ఇన్చార్జి కందుల శ్రీను, ఉమాదేవి, యశోద ఆసుపత్రి సీనియర్ ఎగ్జిక్యూటివ్ (పి.ఆర్.ఓ) అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిండి ప్రాజెక్టుపై వివక్షను సహించం

- సమాన మట్టంతో నీటిని కేటాయించాలి
- ఏప్రిల్ 5న నల్లగొండలో సీపీఐ భారీ సదస్సు
- జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి డిమాండ్




**నల్లగొండ, మహా :** డిండి ఎత్తిపోతల పథకం విషయంలో నల్లగొండ జిల్లాపై జరుగుతున్న వివక్షను తక్షణమే ఆపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మఖ్దూమ్ భవన్‌లో జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఏదుల రిజర్వాయర్ నుంచి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఇచ్చే విధంగానే, డిండి కాలువకు కూడా సమాన ఎత్తు (లెవెల్) నుంచి నీటిని సరఫరా చేయాలని కోరారు.

**అన్యాయం జరిగితే ఊరుకోం..**

పాలమూరు ప్రాజెక్టుకు 436 మీటర్ల ఎత్తు నుంచి నీటిని తీసుకునే వీలు కల్పిస్తూ, డిండికి మాత్రం 440 మీటర్ల నిబంధన విధించడం ఏంటని? ఆయన ప్రశ్నించారు. ఈ నిబంధన వల్ల జిల్లాకు రావాల్సిన 30 టీఎంసీల నీటిలో కేవలం 7 టీఎంసీలు మాత్రమే వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజనీర్లు ద్వంద్వ వైఖరి వీడాలని హెచ్చరించారు. ఈ అన్యాయాన్ని ఎండగట్టేందుకు ఏప్రిల్ 1, 2 తేదీలలో సీపీఐ బృందం బీసీ టన్నెల్, ఏదుల రిజర్వాయర్లను సందర్శిస్తుందని ఏప్రిల్ 5న జిల్లా కేంద్రంలో అఖిలపక్ష సదస్సు నిర్వహిస్తామని ప్రకటించారు.

**ఎండిపోతున్న పంటలు ఆదుకోవాలి.. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు విడతల రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని, యూరియా సరఫరాలో కొత్తగా ప్రవేశపెట్టిన యాప్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే పారదర్శకంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బొల్లగిరి నర్సింహా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, శ్రవణ్ కుమార్, ఉజ్జిని యాదగిరి రావు, పబ్బు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ట్రాక్ కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలి



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి రైల్వే ట్రాక్ కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మణుగూరు ఏరియా కార్యదర్శి ఆదేర్ల సురేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సరైన సమయానికి జీతాలు అందక కార్మికులు కుటుంబ పోషణ కోసం అప్పులు చేసి గడుపుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న కార్మికులు, పండుగ వేళల్లో కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొనడం దురదృష్టకమని పేర్కొన్నారు. ఇంతవరకు వేతనాలు చెల్లించకపోవడం కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రైల్వే ట్రాక్ పనుల్లో నిమగ్నమైన కాంట్రా క్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసు కోవాలని కోరారు. అలాగే సింగరేణి సివిల్ అధికారులు, యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికులకు పెండింగ్ వేతనాలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | ఆదివారం, హైదరాబాద్ | 22-03-2026
ANN తెలుగు

## మరో రెండు కథలకు గ్రీన్ సిగ్నల్



కథానాయకుడు నితిన్ సినిమాల విషయంలో వేగం పెంచుతున్నారు. ప్రస్తుతం వీఐ ఆనంద్ దర్శకత్వంలో ఓ సైన్స్ ఫిక్షన్ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడిది ఇంకా పూర్తి కాకుండానే మరో రెండు ప్రాజెక్ట్‌ల్ని పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. 'ఆయ్' సినిమాతో తొలి ప్రయత్నంలోనే ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు అంజి. ఇప్పుడాయన చెప్పిన ఓ కథకు నితిన్ పచ్చజెండా ఊపినట్లు సమాచారం. అంతేకాదు దీన్ని ఆయన సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ఠ్ మూవీస్‌లోనే నిర్మించనున్నట్లు తెలిసింది. ఇది సంక్రాంతి విడుదలే లక్ష్యంగా.. జులై నుంచి చిత్రీకరణ ప్రారంభించుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అయితే ఈలోగానే నితిన్ ఓ కొత్త దర్శకుడితో మరో చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ దీన్ని నిర్మించనుందని.. వచ్చే నెలలోనే ఇది లాంఛనంగా మొదలు కానుందని టాక్. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు తెలుస్తోంది.





## 4 గంటల సినిమా తీయాలంటే గట్స్ ఉండాలి: రాజమౌళి

రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్యధర్ దర్శకత్వం వహించిన 'ధురంధర్ 2' (Dhurandhar 2) ఉగాది సందర్భంగా విడుదలై భారీ విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలోనే ఎన్టీఆర్, రామ్‌చరణ్, మహేష్‌బాబు, విజయ్ దేవరకొండ వంటి ప్రముఖ హీరోలు చిత్ర బృందాన్ని ప్రశంసిస్తున్నారు. తాజాగా దర్శక దిగ్గజం ఎస్ఎస్ రాజమౌళి (SS Rajamouli) సోషల్ మీడియా వేదికగా 'ధురంధర్ 2' దర్శకుడు, హీరోని ప్రశంసిస్తూ, టీమ్‌ని అభినందిస్తూ ఎక్స్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు.

''ధురంధర్' నాకు బాగా నచ్చింది. దానికి సీక్వెల్‌గా వచ్చిన 'ధురంధర్: ది రివెంజ్'లోనూ భావోద్వేగాల పరంగా ఏమాత్రం తగ్గలేదు. ఆదిత్యధర్ (dhurandhar director) నాలుగు గంటల పాటు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని తెరపై ఆవిష్కరించారు. ఇలాంటి సినిమా తీయాలంటే గట్స్ ఉండాలి. రచన, నటీనటులు, సాంకేతిక పరిజ్ఞానం, సంగీతం వేటిల్లోనూ లోపాలు కనిపించలేదు. చివరి ఫ్రేమ్ వరకూ ప్రేక్షకులు సీట్లకు అతుక్కుపోయేలా చిత్రాన్ని తెరకెక్కించారు. సినిమాలో వచ్చే మలుపులు, భావోద్వేగాలను తెరపై చూపించడంలో దర్శకుడు విజయం సాధించారు. రణ్‌వీర్ (Ranveer Singh) తన నటనతో మంత్రముగ్ధుల్ని చేశారు. జస్కిరాత్ సింగ్, హమ్జా అలీ మజారీగా రెండు పాత్రలకూ న్యాయం చేశారు. షెడ్డులో బంధించిన సోదరిని కలిసే సమయంలో ఆయన నటన మాస్టర్‌క్లాస్. సినిమా మొదటినుంచి పతాక సన్నివేశం వరకు రణ్‌వీర్ నటన హృదయాన్ని మెలిపెట్టేలా ఉంది. దేశ నిస్సహాయతను, అసహనాన్ని మాధవన్ తెరపై చక్కగా ప్రదర్శించారు. ఈ విజయం మనందరిదీ'' అంటూ రాజమౌళి 'ధురంధర్ 2' చిత్రబృందాన్ని కొనియాడుతూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

### దర్శకులను సూపర్‌స్టార్లు తొక్కేస్తున్నారు:

## కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు

వివాదాస్పద అంశాలపై కూడా సూటిగా, స్పష్టంగా తన అభిప్రాయాలను వెల్లడించే నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భారతీయ సినీ పరిశ్రమలో సూపర్‌స్టార్లు ఫిల్మ్‌మేకర్లను వేధిస్తారని, వారిని బెదిరింపులకు గురిచేస్తారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఈ విషయంపై ఆమె గళం విప్పారు. హాలీవుడ్‌లో ప్రముఖ నటుల కంటే దర్శకులకే ఎక్కువ పేరు, గౌరవం ఉంటాయని, కానీ బాలీవుడ్‌లో పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల ఘన విజయం సాధించిన 'ధురంధర్ 2' చిత్రం సందర్భంగా దర్శకుడు ఆదిత్య ధర్‌ను ప్రశంసిస్తూ కంగనా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక సుదీర్ఘమైన నోట్ రాశారు. భారతీయ చిత్ర పరిశ్రమలో దర్శకులు, ఇతర సాంకేతిక నిపుణులు తీవ్రమైన శ్రమకు గురవుతారని, కానీ వారికి సరైన పారితోషికం గానీ, గుర్తింపు గానీ లభించడం లేదని ఆమె పేర్కొన్నారు. "ధురంధర్ విజయంలో గొప్ప విషయం ఏమిటంటే, ఆదిత్య ధర్ ఒక సూపర్‌స్టార్ డైరెక్టర్‌గా స్థిరపడటం. స్పీల్‌బర్గ్, టరంటినో, నోలన్ వంటి హాలీవుడ్ సూపర్‌స్టార్ దర్శకులకు ఎప్పుడూ అక్కడి నటుల కన్నా అధిక ప్రాధాన్యత ఉంటుంది. కానీ మనం మన ఫిల్మ్‌మేకర్లకు తగినంత గౌరవం ఇవ్వం" అని కంగనా వ్యాఖ్యానించారు.

"దర్శకులు అధిక శ్రమకు గురవుతూ, తక్కువ వేతనం పొందుతూ సూపర్‌స్టార్ల చేతిలో వేధింపులకు గురవుతున్నారు. దీని ఫలితంగానే, ఫిల్మ్‌మేకర్ కావాలని లేదా సినిమాటోగ్రాఫర్ అవ్వాలని కలలు కనే యువతను నేను ఎప్పుడూ కలవలేదు. ప్రతి ఒక్కరూ తమకు టాలెంట్ ఉందని చెప్పుకుంటారు, కానీ అందరూ నటులు కావాలనే కోరుకుంటారు. ఇక్కడ ఏ హీరో కన్నా ప్రకాశవంతంగా వెలిగిపోతున్న ఒక సూపర్‌స్టార్ ఫిల్మ్‌మేకర్ (ఆదిత్య ధర్) ఉన్నారు. ఇప్పుడు ఎందరో యువకులు ఆయన కథను చూసి, ఆయనలాగే ఎదగాలని ఆకాంక్షిస్తారు. సినీ పరిశ్రమను ఉన్నత శిఖరాలకు తీసుకెళతారు. ఆదిత్య ధర్... మీకు నా వందనాలు" అని కంగనా తన పోస్టులో రాసుకొచ్చారు.

ఈ పోస్టులో దర్శకుడు ఆదిత్య ధర్‌పై ప్రశంసల వర్షం కురిపించిన కంగనా, చిత్ర కథానాయకుడు రణ్‌వీర్ సింగ్‌ను గానీ, ఇతర నటీనటులను గానీ ట్యాగ్ చేయకపోవడం గమనార్హం.



## ఏ అమ్మాయి కూడా అలా చేయలేదేమో



శారీరకంగా ఎన్నో మార్పులు చేసుకున్నాను కాబట్టే.. పరిశ్రమలో తట్టుకొని నిలబడ్డానని అంటోంది బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్. ఈ మధ్యకాలంలో ప్రయోగాత్మక, శక్తిమంతమైన పాత్రలతో ప్రయాణిస్తున్న నాయికీమె. ఇటీవలే 'దల్దాల్' సిరీస్‌తో ప్రేక్షకుల్ని అలరించిన ఈమె.. ఇక్కడ సినిమా పట్ల లోతైన అవగాహన లేకుండానే చాలా మంది విమర్శకులుగా మారారని చెప్తుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న భూమి సోషల్ మీడియాలో ట్రోల్స్, తన సినీ కెరీర్ గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

"దశాబ్ద కాలంగా చిత్రపరిశ్రమలో నా ప్రయాణం సాగుతోంది. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే నేను ఎంచుకున్న పాత్రల కోసం ఎన్నో శారీరక మార్పులకు లోనయ్యాను. దీని వల్ల చాలా నష్టాలు ఎదురయ్యాయి. ఏ అమ్మాయి కూడా అలా చేయలేదేమో. నేను ఎంపిక చేసుకున్న కథల్లో జీవించడానికి నిరంతరం మారుతూ వచ్చా. దీంతో పాటు రూ.300350 కోట్ల విలువైన భారీ బడ్జెట్ చిత్రాలతో సహా ఎన్నో ప్రాజెక్టులను తిరస్కరించా. ఎందుకంటే అవి నా ఆలోచనలకు అనుగుణంగా లేవు. భవిష్యత్తులో చిత్ర నిర్మాణంలోకి అడుగుపెట్టాలనుకుంటున్నా".

**అదెంతవరకూ నిజమో తెలియదు**

"నేటి సినిమాల్లో విమర్శనాత్మక ఆలోచన ఎక్కువగా ఉందో లేదో నాకు తెలియదు కానీ సినిమాల గురించి మాట్లాడే విధానంలో, వాటిని విమర్శించే విధానంలో మాత్రం చాలా మార్పులు వచ్చాయి. ఇక్కడ ప్రతి ఒక్కరూ విమర్శకులే. సినిమా అనేది ఓ గొప్ప అధ్యయనం. మాకు సినిమా ప్రశంసను కూడా ఒక కోర్సులా నేర్పించారు. నా కెరీర్ తొలినాళ్లలో సమీక్షలు ప్రత్యేక అర్థాన్నిచ్చేవి. సమీక్షల కోసం ఎదురుచూసేదాన్ని. నేడు సినిమా విజయంలో ఎక్కువ భాగం శుక్రవారం మీదే ఆధారపడి ఉంటుంది. కానీ అదెంతవరకు నిజమో నాకు తెలియదు. మధ్యతరహా, చిన్న సినిమాలు ఎప్పుడూ నోటి మాట ద్వారానే విజయాన్ని అందుకుంటాయి. నా సినిమాలు కూడా ఆ కోవకు చెందినవే. రాజ్‌కుమార్ రావ్, ఆయుష్మాన్ ఖురానా.. ఇలా నాతో పాటు చాలా మంది నటీనటుల కెరీర్‌లు నోటి మాట ద్వారా హిట్ అయినా చిత్రాల వల్లే నిలిచాయి".

**ఆమే నాకు స్ఫూర్తి**

"ప్రస్తుతం అన్ని రంగాల్లో కృతిమ మేధ (ఏఐ) కచ్చితంగా ఉంటుంది. అది అనివార్యంలా మారింది. అందుకే దాన్ని ప్రతిఘటించడానికి బదులుగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఒక సాధనంగా వినియోగించుకోవాలి. ఇలాంటి సాంకేతికత వల్ల నా ఆలోచనా విధానాల్లోనూ మార్పులు వచ్చాయి. స్క్రిప్ట్, పాత్రలు ఎంపికల్లో ఏఐని ఉపయోగించను కానీ.. ఆ పాత్ర లోతు తెలుసుకోవడానికి దీన్ని వినియోగిస్తా. నేను కథానాయిక ప్రియాంక చోప్రాకు అభిమానిని. ఎన్నో విషయాల్లో తనని స్ఫూర్తిగా తీసుకుంటా".

**అదొక గుణపాఠం**

"నా కెరీర్‌లోనే 'ది లేడీ కిల్లర్' చిత్ర వైఫల్యం వ్యక్తిగతంగా, వృత్తిపరంగా నన్ను తీవ్రంగా దెబ్బతీసింది. ఇక నా పనైపోయిందనుకున్నా. మొదట నాకు ఇచ్చిన స్క్రిప్ట్ పరిపూర్ణంగానే ఉంది. కానీ అందులో చాలా భాగాన్ని తెరకెక్కించలేదు. అసంపూర్తిగా సినిమాను విడుదల చేశారు. ఇది నాకు ముందే తెలిసుంటే బాగుండేది. నేను కూడా మేకింగ్‌లో భాగమై ఉంటే కొన్ని విషయాల్ని మార్చగలిగేదాన్ని. అయినా జరిగినదానికి నేను చాలా ఆశ్చర్యపోయా. ఎందుకంటే గతంలో ఎప్పుడూ అలా జరగలేదు. ఈ సినిమా పరిస్థితి ఏంటా అని భయపడ్డాను. చివరకు ఇదొక గుణపాఠంలా భావించి నాకు నేను సర్దిచెప్పుకున్నా".

## అల్లు అర్జున్.. కొత్త సినిమాల సంగతులు చాలానే!

అల్లు అర్జున్ చేయనున్న సినిమాలపై ఎప్పటికప్పుడు స్పష్టత వస్తున్నప్పటికీ... ఆ సినిమాల వెనక సంగతులు మాత్రం అభిమానుల్ని ఊరిస్తున్నాయి. అల్లు అర్జున్ అట్లీ కలయికలో రూపొందుతున్న సినిమా పేరేమిటి? విడుదల ఎప్పుడు? అందులో లుక్, ఆ కథా ప్రపంచం ఎలా ఉంటుంది? అలాగే అల్లు అర్జున్ లోకేశ్ కనగరాజ్ కలయికలో సినిమా ఎప్పుడు మొదలవుతుంది? అందులో హీరోయిన్, ఇతర తారాగణం ఎవరు? ఇలా బోలెడన్ని సంగతులు తెలియాల్సి ఉంది. అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా పట్టాలెక్కి చాలా రోజులైనా, ఏ విషయం కూడా బయటకు రాకుండా అత్యంత గోప్యంగా ముంబయిలో చిత్రీకరణ జరుపుతున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న సినిమాని కూడా అధికారికంగా ప్రకటించినప్పటికీ, మిగతా విషయాలపై స్పష్టత ఇవ్వలేదు.

ఆ సంగతులన్నీ బయటకు రావడానికి తగిన సమయం రానే వచ్చింది. అల్లు అర్జున్ పుట్టినరోజు ఏప్రిల్ 8. ఆరోజే ఆయన, అట్లీ కలయికలో రూపొందుతున్న సినిమా లుక్‌ని విడుదల చేయనున్నారు. దాంతోపాటుగా సినిమా పేరు, విడుదల తేదీని కూడా ప్రకటించే అవకాశాలున్నట్టు సమాచారం. ఇప్పటికే అందుకు సంబంధించిన కసరత్తులో చిత్రబృందం నిమగ్నమైనట్టు తెలుస్తోంది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న సినిమా ప్రారంభ విశేషాలు కూడా ఆరోజే అని సమాచారం. వీటితోపాటు కొత్త సినిమాలపై కూడా స్పష్టత వచ్చే



అవకాశాలున్నాయని, రెండు మూడు రోజులపాటు అల్లు అర్జున్ సినిమాల విశేషాల సందడి కొనసాగే అవకాశం ఉందని తెలిసింది.

### సందీప్ కిషన్‌తో 'శంబాల'

## మేకర్స్ పాన్ ఇండియా మూవీ






ఆది సాయికుమార్ కథానాయకుడిగా యుగంధర్ ముని దర్శకత్వంలో రూపొందిన బ్లాక్ బస్టర్ చిత్రం 'శంబాల'. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న ఈ మూవీ ఆది కెరీర్‌లో మర్చిపోలేని హిట్ ఇచ్చింది. ఇప్పుడు దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు మళ్లీ ఓ అద్భుతాన్ని సృష్టించేందుకు రెడీ అయ్యారు. 'శంబాల' తరువాత దర్శక, నిర్మాతలు కలిసి చేస్తున్న ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. సందీప్ కిషన్‌తో ఓ భారీ పాన్ ఇండియా సోషియో ఫాంటసీ మూవీని మేకర్స్ ప్లాన్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు తెలియజేస్తూ పోస్టర్‌ను పంచుకున్నారు. యుద్ధభూమి నేపథ్యంలో సింహం, తోడేలు మధ్య ఒక పురాతన ఖడ్గం ఉంది. 'కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు' అనే క్యాప్షన్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రాన్ని పాన్‌ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, రెగ్యులర్ షూటింగ్ ఆగస్టు 2026లో ప్రారంభం కానుందని నిర్మాతలు ప్రకటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com